**విలేఖరులు కావలెను**

పత్రికా రంగం లో సరికొత్త సంచలనం..
మా జన సముద్రం..
ప్రతి అక్షరం జనం కోసం మా నినాదం..
అనుక్షణం ప్రజా ప్రయోజనమే మరియు సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగనున్న మా పత్రిక లో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ జిల్లాలు,మండలాల వారీగా విలేఖరులు కావలెను..సామాజిక స్పృహ,వార్తల సేకరణ పట్ల మక్కువ.. నిజాయితీ ఇవే మా విలేఖరులకు ఉండవలసిన ముఖ్య అర్హతలు..!

సంప్రదించండి.. 9494184136



RNI NO:APTEL16151

# జనసముద్రం న్యూస్

నిరంతర వార్తా ప్రవాహం

ప్రతి అక్షరం జనం కోసం

Save Farmers

JANASAMUDRAM.COM

సంపుటి: 03 సంచిక : 104 సోమారం, జూలై 15, 2024 RNI NO: APTEL16151 పేజీలు : 8 వెల: రూ.2




## విద్యుత్తు కమిషన్‌పై సుప్రీంకు కేసీఆర్

### విద్యుత్తు కమిషన్‌పై సుప్రీంకు కేసీఆర్

### కమిషన్‌ను రద్దు చేయాలంటూ పిటిషన్

### నేడు విచారణ చేపట్టనున్న సీజేఐ ధర్మాసనం

న్యూఢిల్లీ, జూలై 14 : తెలంగాణ ప్రభుత్వం నియమించిన విద్యుత్తు కమిషన్‌ను రద్దు చేయాలంటూ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖర్ రావు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. విద్యుత్తు కమిషన్ విచారణను కొనసాగించవచ్చని హైకోర్టు సీజే ధర్మాసనం ఇచ్చిన తీర్పును.. దేశ సర్వోన్నత న్యాయస్థానంలో సవాల్ చేశారు. కేసీఆర్ పిటిషన్‌పై సోమవారం భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని జస్టిస్ జేబీ పార్థివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం విచారించనుంది.

# ప్రభుత్వం కూలుతుందన్న వాళ్లు.. ఇప్పుడు ఎక్కడ?

**తెలంగాణ అభివృద్ధి కోసమే కాంగ్రెస్‌లో చేరుతున్నారు.. ఏ గూట్లో చేయి పెట్టినా అప్పుల కాగితమే కనిపిస్తోంది**

**ప్రతి నెలా వడ్డీలే రూ.7 వేల కోట్లు చెల్లించాల్సి వస్తోంది.. మహేశ్వరాన్ని మరో న్యూయార్క్‌లాగా అభివృద్ధి చేస్తాం**

**చదువు ద్వారా బలహీనవర్గాలు పాలకులుగా ఎదగాలి.. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రచారం చేయకపోతే**

**ఎంపీలు, ఎమ్మెల్యేల ఉద్యోగాలు ఉండవు. హయత్‌నగర్ వరకు మెట్రో రైలు విస్తరణ: సీఎం రేవంత్**



హైదరాబాద్, జూలై 14 : "ప్రభుత్వాన్ని పడగొడతామని అచ్చోసిన ఆంబోతుల్లా బీఆర్ఎస్, బీజేపీ వాళ్లు అంటే.. మేం నిలబెడతామని ఎమ్మెల్యేలు ముందుకు వస్తున్నరు. తెచ్చుకున్న తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే సర్కారుకు అండగా ఉంటామంటున్నరు" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. సర్కారు పనయిపోయిందని, కూలిపోతుందని అన్నవాళ్లు ఇప్పుడు ఎక్కడున్నారని, రోజులు లెక్కపెట్టుకుంటున్నది ఎవరని ప్రశ్నించారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం లష్కర్‌గూడలో బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో గీత కార్మికులకు 'కాటమయ్య రక్షక కవచం' కిట్లను పంపిణీ చేసిన సందర్భంగా నిర్వహించిన సభలో సీఎం మాట్లాడారు. "మూడు నెలలు, ఆరు నెలలు కాదు. ఈ ప్రభుత్వం పదేళ్లు ఉంటది. 2004 నుంచి 2014 వరకు దేశంలో కాంగ్రెస్ అందించిన జనరంజక పాలనను మరోసారి అందిస్తుంది. ఓడినోళ్లు, ఇంట్లో పడుకున్నోళ్లు, ఫామ్‌హౌసలో ఉంటున్నోళ్లను అడుగుతున్నా.. ఔటర్ రింగ్ రోడ్డు, అంతర్జాతీయ విమానాశ్రయం, ఐటీ, ఫార్మా కంపెనీలు తెచ్చింది కాంగ్రెస్ పార్టీ కాదా? అవన్నీ తెచ్చినందుకే హైదరాబాద్ మహానగరంగా మారింది. మీరు నగరానికి తీసుకొచ్చింది ఏవైనా ఉంటే గంజాయి, డ్రగ్స్ మాత్రమే" అని సీఎం రేవంత్ అన్నారు. తెచ్చుకున్న తెలంగాణను

(మిగతా 2వ పేజీలో)



## మరో డీఎస్సీ!

### ప్రస్తుత డీఎస్సీని వాయిదా వేయం.. అలా చేస్తే అభ్యర్థులకే నష్టం

### విద్యా వ్యవస్థ బలోపేతం మా లక్ష్యం.. ఉప ముఖ్యమంత్రి భట్టి

హైదరాబాద్, జూలై 14 : ప్రస్తుత పరిస్థితుల్లో డీఎస్సీ పరీక్షలను వాయిదా వేయడం కుదరదని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఇదే చివరి డీఎస్సీ కాదని.. మరిన్ని ఉంటాయని చెప్పారు. త్వరలో 5 వేల నుంచి 6 వేల పోస్టులతో కొత్త డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేస్తామని తెలిపారు. డీఎస్సీని పకడ్బందీగా నిర్వహిస్తామని.. విద్యా వ్యవస్థ బలోపేతం, పేద విద్యార్థులకు మంచి బోధన అందాలనేదే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. తొందరగా ఉద్యోగాలివ్వడమే ప్రభుత్వ ఉద్దేశమని చెప్పారు. గాంధీభవన్‌లో ఆదివారం భట్టి మీడియాతో మాట్లాడారు. కొంతమంది నియామక పరీక్షలు వాయిదా వేయాలని ధర్నా చేస్తున్నారని.. అలాచేస్తే నష్టపోయేది అభ్యర్థులేనని అన్నారు. ఈ నెల 11 నుంచే డీఎస్సీ హాల్ టికెట్లు అందుబాటులో

(మిగతా 2వ పేజీలో)



## పూరీలో తెరుచుకున్న.. రత్నభండార్

భువనేశ్వర్: అశేష భక్తజనం ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న క్షణం రానే వచ్చింది. ఒడిశాలోని ప్రఖ్యాత పూరీ జగన్నాథ స్వామికి శతాబ్దాలుగా రాజులు, భక్తులు కానుకగా సమర్పించిన వజ్రాభరణాలు, వెండి, బంగారు నిల్వలను దాదాపు 46 ఏళ్ల తర్వాత తొలిసారిగా తనిఖీచేయనున్నారు. ఆభరణాలను తూకం వేసి, నాణ్యత లెక్కించి, అవసరమైతే మరమ్మతులు చేయనున్నారు. ఆలయంలోని రహస్య ఖజానా గది జీర్ణావస్థకు చేరిన నేపథ్యంలో గదికి మరమ్మతులు చేయనున్నారు. అంతవరకు అపారమైన ఖజానాను జాగ్రత్తగా వేరేచోట భద్రపరచనున్నారు. ప్రభుత్వ కమిటీ సభ్యులు ఆదివారం మధ్యాహ్నం ఆలయానికి చేరుకున్నారు. ఆలయ పూజారులు ప్రత్యేక పూజలు చేసి

(మిగతా 2వ పేజీలో)

## ప్రధాని సరికొత్త రికార్డు.. 'ఎక్స్'లో ఫాలోవర్లు 10 కోట్లు



న్యూఢిల్లీ: ఎక్స్(ట్విటర్)లో ఫాలోవర్ల సంఖ్య విషయంలో ప్రధాని మోదీ కొత్త రికార్డు నెలకొల్పారు.'ఎక్స్'లో ఆయన ఫాలోవర్ల సంఖ్య ఆదివారం (జులై 14) 100 మిలియన్ల మార్కు(10 కోట్లు)ను దాటారు.దీనిపై ప్రధాని మోదీ స్పందించారు. ఫాలోవర్ల సంఖ్య 10 కోట్లు దాటడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.'ఎక్స్‌లో ఉండటం, ఈ వేదికగా చర్చలు, ప్రజల ఆశీర్వాదాలు, నిర్మాణాత్మక విమర్శలు లభిస్తుండటం సంతోషంగా ఉంది' అని మోదీ పోస్ట్ చేశారు.



## ముంబయిలో మహారాష్ట్ర సీఎం ఏక్ నాథ్ షిండేతో ఏపీ సీఎం చంద్రబాబు సమావేశం

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నిన్న ముంబయిలో అనంత్ అంబానీ, రాధికా మర్చంట్ ల వివాహ వేడుకకు హాజరైన సంగతి తెలిసిందే. సీఎం చంద్రబాబు రాత్రికి ముంబయిలోనే బస చేశారు. ముంబయిలోని వర్ష భవన్ లో ఇవాళ మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్ నాథ్ షిండేను కలిశారు. చంద్రబాబుకు ఆత్మీయ స్వాగతం పలికిన షిండే... ఆయనకు శాలువా కప్పి, జ్ఞాపికను బహూకరించారు. అనంతరం ఇరువురి మధ్య సమావేశం జరిగింది. ఎన్డీయే కూటమి భాగస్వాములైన చంద్రబాబు, షిండే పలు అంశాలపై చర్చించుకున్నారు.

# ప్రభుత్వం కూలుతుందన్న వాళ్లు.. ఇప్పుడు ఎక్కడ?



బాగు చేసుకునేందుకు తాపత్రయపడుతున్న తనకు మద్దతిస్తే మరింత బలపడతానని, చేతనైనంత సాయం చేస్తామని ఎమ్మెల్యేలు వస్తున్నారని అన్నారు. వారికి ఇవ్వడానికి తన దగ్గర ఏమున్నాయని, తన అంగీ, లాగు అమ్మినా ఏమీ రాదని వ్యాఖ్యానించారు.

### రాష్ట్రాన్ని దివాలా తీయించారు

పదేళ్లు ఏమీ చేయనివారు ఉన్నదంతా అమ్ముకొని ఊడ్చుకుపోయారని, రూ.7 లక్షల కోట్ల అప్పులు చేసి.. రాష్ట్రాన్ని దివాలా తీయించారని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. "ఏ గూట్లో చేయి పెట్టినా అప్పుల కాగితమే బయటకు వస్తోంది. గతంలో సంవత్సరానికి రూ.6500 కోట్ల అప్పు కట్టేది ఉండె. ఇయ్యాల ప్రతి నెలా మొదటి తారీకున రూ.7 వేల కోట్లు వడ్డీయే కడుతున్నం. ఏటా రూ.72 వేల కోట్లు మిత్తి కట్టనీకే అయితుంది. సంసారం అప్పులపాలైంది. ఒక్కటొక్కటిగా సరిదిద్దుకుంటూ వస్తున్నం" అని సీఎం తెలిపారు. అమెరికాలోని న్యూయార్క్ నగరం తరహాలో మహేశ్వరంలో మరో మహానగరాన్ని అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. ఫార్మా కంపెనీల కోసం కేటాయించిన భూముల్లో విశ్వవిద్యాలయాలు, మెడికల్ టూరిజం, పరిశ్రమల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. తాను పాదయాత్ర చేసిన సమయంలో రాచకొండ గుట్టల పక్కనున్న తండాల్లోకి వెళ్లానని, ఊటీ కంటే అద్భుతమైన వాతావరణ పరిస్థితులు ఇక్కడ ఉన్నాయని, ఈ ప్రాంతాన్ని షూటింగ్‌లకు హబ్‌గా మార్చబోతున్నామని చెప్పారు. రంగారెడ్డి జిల్లాకు మహర్దశ పట్టనుందని, ప్రపంచంలోనే అద్భుత పర్యాటక క్షేత్రంగా జిల్లాను తీర్చిదిద్దుతామని ప్రకటించారు. హయత్‌నగర్ వరకు త్వరలో మెట్రో రాబోతోందని, అటు అంతర్జాతీయ విమానాశ్రయం వరకు ఎలాంటి అంతరాయం లేకుండా రాకపోకలు సాగించేలా మెట్రో రైల్‌ను విస్తరిస్తున్నామని తెలిపారు. రంగారెడ్డి జిల్లాలో భూమి బంగారమైందని, దేశంలో ఎక్కడా లేనివిధంగా ఎకరం రూ.100 కోట్లు పలుకుతోందని చెప్పారు. రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణంతో అభివృద్ధి మరింతగా పరుగులు పెడుతుందన్నారు.

### బలహీనవర్గాలు పాలకులుగా ఎదగాలి

బలహీనవర్గాలు పాలకులుగా మారాలంటే ఏకైక మార్గం చదువేనని సీఎం అన్నారు. ఇందుకోసం వైఎస్ఆర్ ప్రారంభించిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ఈ ప్రభుత్వం సమర్థవంతంగా కొనసాగిస్తోందన్నారు. "కుల వృత్తులను నమ్ముకొని మీరు కష్టపడుతున్నరు. మీ పిల్లలను ఉన్నత విద్యావంతులను చేయడం ద్వారా వారి భవిష్యత్తుకు మంచి బాటలు వేయాలి. చట్టసభల్లో శాసనాలు చేసే స్థాయికి మీ పిల్లలు ఎదగాలి" అని రేవంత్ ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరికీ ఉద్యోగ అకాశాలు రాకపోవచ్చని, కుల వృత్తుల బలోపేతానికి చర్యలు తీసుకోవడం ద్వారా కుటుంబాలను నిలబెట్టినట్లవుతుందని చెప్పారు. వన మహోత్సవంలో భాగంగా కొత్తగా నిర్మించే రోడ్ల పక్కన, చెరువు కట్టలపై, కాలువల వెంట, సాగునీటి ప్రాజెక్టుల వద్ద తాటి చెట్లు, ఈత చెట్లు నాటేలా అటవీ శాఖతో సమన్వయం చేసుకోవాలని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు సీఎం సూచించారు. ఇరిగేషన్ విభాగంతో ఈ విషయంపై చర్చించి ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని మంత్రి శ్రీధర్‌బాబును కోరారు. గ్రామాలు, పట్టణాల్లో ప్రభుత్వ భూములు అందుబాటులో ఉంటే తాటి, ఈత వనాల కోసం కేటాయించేందుకు అభ్యంతరం లేదన్నారు. మరణించిన, గాయపడిన గీత కార్మికులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న రూ.7.90 కోట్లను వెంటనే విడుదల చేస్తామని ప్రకటించారు. ఎవరెస్ట్ ఎక్కిన మాలావత్ పూర్ణ బృందం అనుభవం గౌడన్నలకు ఉపయోగపడతుందన్నారు.

### వాళ్ల ఉద్యోగాలు ఊడుతాయి

"స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంపీలు, ఎమ్మెల్యేలు ప్రచారం చేయకపోతే వాళ్ల ఉద్యోగం ఊడుతది. సర్పంచ్‌లు, ఎంపీటీసీలను గెలిపించుకుంటేనే మనకు బలం. అందరం కలిసి ప్రభుత్వాన్ని తెచ్చుకున్నం.. పదేళ్లు కష్టపడి కాపాడుకుందాం.. అభివృద్ధి చేసుకుందాం" అని రేవంత్ అన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ గీత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. తాటి, ఈతకు సంబంధించి 80 బైప్రొడక్టుల విషయంపై ఆలోచిస్తామన్నారు. పరిశ్రమల ఏర్పాటు ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కాగా, గడిచిన పదేళ్లలో గీతకార్మికులకు ఎలాంటి సహకారం అందలేదని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం అన్నారు. నీరా, తాటికల్లును సహజ ఉత్పత్తులుగా అమ్ముకునేలా వ్యవస్థలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. సభ ముగుస్తున్న సమయంలో కొందరు మధ్యాహ్న భోజన కార్మికులు లేచి నినాదాలు చేశారు. దీంతో పోలీసులు వారిని అడ్డుకునే ప్రయత్నం చేయగా వారిని ఏమీ అనవద్దని, వారి సమస్యలను ఎమ్మెల్యేకు, ఎంపీకి తెలపాలని సూచించారు. సీఎం సభలో కూర్చున్న సమయంలో వీఐపీ గ్యాలరీ నుంచి ఓ మహిళ లేచి వినతి పత్రం చూపించగా వారి వద్దకు వెళ్లి తీసుకోవాలని తన సలహాదారు వేం నరేందర్‌రెడ్డికి రేవంత్ సూచించారు.

### నిరుద్యోగులూ.. మీ బాధలు చెప్పండి!

నిరుద్యోగుల బాధలు వినేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. "నిన్న, మొన్న మా పిల్లలు కూడా పరీక్షలు వాయిదా వేయండని కోరుతున్నరు. మీ బాధలు వినేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. పిల్లలు రోడ్డెక్కే బదులు.. మంత్రులను కలవండి. సాధక బాధకాలుంటే చెప్పండి. తప్పకుండా విని సమస్యలు పరిష్కరించే బాధ్యత మాది" అని చెప్పారు. నిరుద్యోగులతో మాట్లాడి.. వారి ఇబ్బందులు తెలుసుకొని ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సూచించారు.

### సేఫ్టీ కిట్ బాగుందా

లష్కర్‌గూడ గ్రామంలోని వనంలో సీఎం రేవంత్‌రెడ్డి ఈత చెట్టును నాటిన అనంతరం.. కాటమయ్య రక్షక కవచాలను ధరించిన గీత కార్మికులు చెట్టుపై ప్రమాదం జరిగితే కవచాలు ఎలా కాపాడుతాయో ప్రయోగాత్మకంగా చూపించారు. కొంతమంది కార్మికులు కవచాలు ధరించి చెట్టు ఎక్కి మోకును వదిలేసి వేలాడారు. ఈ సందర్భంగా కార్మికులు తాటిచెట్టుపై ఉండగానే వారితో సీఎం మాట్లాడారు. రక్షక కవచం భాగుందా? అని రంగయ్య అనే గీత కార్మికుడిని ప్రశ్నించారు. అతడు 'బాగుంది సార్' అని చెప్పగా.. గుతి పోతే తిరిగి ఎలా పెట్టుకుంటారని అడిగారు. వెంటనే కాళ్లతో గుతిని పెట్టుకుని కార్మికులు చూపించారు. మరో కార్మికుడిని ఉద్దేశించి, 'ఏం గౌడ్ సాబ్! ఆ ఎల్లో టీషర్టు వేసుకున్నాయన పేరేంటి? నీ టీషర్టు బాగుంది" అని రేవంత్ అన్నారు. అతడు, 'కృష్టయ్య సార్' అని చెప్పగా.. 'రోజుకు ఎన్ని చెట్లు ఎక్కుతారు? ఎన్ని లీటర్ల కల్లు వస్తుంది? బెల్టు షాపులు వచ్చి మీ వృత్తిని దెబ్బ తీస్తున్నాయి కదా! అందుకే వాటిని తీసేశాం. అవి రాకుండా చూసుకోండి" అని సీఎం అన్నారు. ఈ సందర్భంగా తాటివనం కోసం 5 ఎకరాల స్థలం, మోపెడ్ వాహనాలు అందించాలని కార్మికులు సీఎంను కోరారు.

# మరో డీఎస్సీ!

ఉంచామని.. కొన్ని నెలలుగా అభ్యర్థులు సిద్ధం అవుతున్నారని.. 18వ తేదీ నుంచి ఆగస్టు 5 వరకు పరీక్షలు నిర్వహించనున్నామని చెప్పారు. కేసీఆర్ ప్రభుత్వంలో పేపర్ లీకేజీలతో అభ్యర్థులు తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. పదేళ్ల పాటు గ్రూప్–1 నిర్వహించనే లేదని విమర్శించారు. గ్రూప్–2ను మూడుసార్లు వాయిదా వేసిన సంగతిని గుర్తుచేశారు. పరీక్షలను అన్నిసార్లు వాయిదా వేయడం సరికాదన్నారు. నిరుద్యోగులకు నష్టం కలగకూడదనేదే తమ ప్రయత్నమని చెప్పారు. తెలంగాణ తెచ్చుకున్నదే యువతకు ఉద్యోగాలు ఇచ్చేందుకుని.. ఆ దిశగా దృష్టిసారించామన్నారు. పదేళ్లుగా డీఎస్సీ లేకపోవడంతో నిరుద్యోగులు, సరైన బోధన అందక పేద విద్యార్థులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారంలోకి రాగానే 16 వేల ఉపాధ్యాయ ఖాళీలు ఉన్నట్లు గుర్తించామని 11వేల పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చామని వివరించారు. 19,717 మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించామని, 34వేల మందిని బదిలీ చేశామని పేర్కొన్నారు. హాస్టల్ వెల్ఫేర్‌కు సంబంధించి 581 ఉద్యోగాలకు పరీక్షలు జరిపామని.. మొత్తం 30 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని వెల్లడించారు. టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో వివిధ శాఖల్లో 13,321 పోస్టులు భర్తీ చేస్తున్నామని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిరుద్యోగులను గాలికి వదిలేశారని భట్టి మండిపడ్డారు. పదేళ్లు డీఎస్సీ ఎందుకు నిర్వహించలేదని ప్రశ్నించారు. ఓట్ల కోసం ఎన్నికలకు ముందు నోటిఫికేషన్ విడుదల చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే గ్రూప్–1 నోటిఫికేషన్ విడుదల చేసి ప్రిలిమ్స్ నిర్వహించి ఫలితాలూ ప్రకటించామని గుర్తుచేశారు. గ్రూప్–3కి సైతం తాము షెడ్యూల్ ఇచ్చామన్నారు.



# పూరీలో తెరుచుకున్న.. రత్నభండార్

ఖజానా యజమానులైన విమలా మాత, మహాలక్ష్మీ ఆజ్ఞ తీసుకున్నారు. తర్వాత ఖజానాకు రక్షకుడైన లోకనాథ్ స్వామి అనుమతి తీసుకున్నారు. మధ్యాహ్నం 1.28 గంటలకు ఖజానా గది తలుపులు తెరిచారు. 11 మంది మాత్రమే సంప్రదాయ దుస్తుల్లో గదిలోకి వెళ్లారు. ఆభరణాలను లెక్కించకుండానే సాయంత్రం 5.20కి బయటికి వచ్చారు.

### తరలింపు మరో రోజున

"లోపలి గది తాళాలు తెరుచుకోకపోవడంతో వాటిని పగలగొట్టి తెరిచాం. ఆభరణాలు, విలువైన వస్తువులను తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్‌లోకి తరలించి సీల్ వేశాం. అన్నింటినీ ఒకే రోజు తరలించడం కష్టం. త్వరలో తేదీని నిర్ణయించి తరలింపు మొదలెడతాం. రిపేర్ల తర్వాత ఆభరణాలకు విలువ కట్టే పని మొదలుపెడతాం' అని ఏఎస్ఐ శాఖ అధికారులు వెల్లడించారు. గదిలోని ఆభరణాలను తరలించేందుకు సిద్ధం చేసిన 4.5 అడుగుల పొడవు, 2.5 అడుగుల వెడల్పు, 2.5 అడుగుల లోతున్న పెద్ద టేకు చెక్కపెట్టెలను గది వద్దకు తెప్పించారు. గదిలో పాములేవీ లేవని తేలింది.

# ట్రంప్‌పై హత్యాయత్నం

## ఎన్నికల ర్యాలీలో ప్రసంగిస్తుండగా కాల్పులు




షికాగో/వాషింగ్టన్: అమెరికా చరిత్రపై మరో రక్తపు మరక. ఆ దేశ మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ (78)పై హత్యా యత్నం జరిగింది. నవంబర్లో జరగనున్న ఎన్నికల్లో గెలిచి మరోసారి అధ్యక్ష పదవి చేపట్టేందుకు రిపబ్లికన్ల అభ్యర్థిగా సర్వశక్తులూ ఒడ్డుతున్న ఆయన ఈ ప్రాణాంతక దాడి నుంచి త్రుటిలో ప్రాణాలతో బయటపడ్డారు. స్థానిక కాలమానం ప్రకారం శనివారం పెన్సిల్వేనియాలోని బట్లర్ టౌన్‌లో ఔట్‌డోర్ ఎన్నికల ర్యాలీలో ఉండగా ఈ ఘోరం జరిగింది. భారీగా హాజరైన మద్దతుదారులు, అభిమానులను ఉద్దేశించి సాయంత్రం ఆరు గంటలకు ట్రంప్ ప్రసంగం మొదలు పెట్టారు. అప్పటికే సమీప గోడౌన్‌పై నక్కిన ఓ దుండగుడు ఏఆర్ శ్రేణి ఆటోమేటిక్ అసాల్ట్ రైఫిల్‌తో ట్రంప్‌పైకి కనీసం ఐదు రౌండ్లకు పైగా కాల్పులు జరిపాడు. దాంతో ఒక్కసారిగా గందరగోళం చెలరేగింది. అరుపులు, కేకలు, ఆక్రందనలు, పారిపోతున్న జనాలతో పరిస్థితి గందరగోళంగా మారింది. ఒక తూటా ట్రంప్ కుడి చెవి పై భాగాన్ని గాయపరిచింది. మరిన్ని తూటాలు ఆయన తలకు అతి సమీపం నుంచి దూసుకెళ్లాయి. ట్రంప్ బాధతో తన చెవిని చేత్తో పట్టుకుంటూనే తూటాల నుంచి తప్పించుకునేందుకు వెంటనే డయాస్ కిందకు వంగారు. ఆలోపే సీక్రెట్ సర్వీస్ సిబ్బంది టంప్రను చుట్టుముట్టి రక్షణ కవచంలా నిలిచారు. చెవి నుంచి కుడి చెంప మీదుగా రక్తమోడుతున్న ట్రంప్‌ను హుటాహుటిన వేదిక నుంచి తీసుకెళ్లి కార్లో కూర్చోబెట్టి సురక్షితంగా తరలించారు. వేదికను వీడుతూ ట్రంప్ పిడికిలి బిగించి పైకెత్తి, సభికులనుద్దేశించి 'ఫైట్' అని పదేపదే భావోద్వేగంతో బిగ్గరగా నినాదాలు చేశారు. వారు కూడా తమ నేతకు మద్దతుగా ఫైట్ అంటూ పెద్దపెట్టున ప్రతి నినాదాలు చేశారు. అక్కణ్నుంచి ట్రంప్‌ను హుటాహుటిన పిట్స్‌బర్గ్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కారెక్కే ముందు కూడా ట్రంప్ మరోసారి పిడికిలి బిగించి నినాదాలు చేశారు. ఈ మొత్తం ఉదంతానికి సంబంధించిన వీడియో ప్రపంచమంతటా వైరలవుతోంది. ట్రంప్ క్షేమంగా ఉన్నట్టు అనంతరం ఆయన ప్రచార కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. దుండగుని కాల్పుల్లో సభికుల్లో ఒకరు దుర్మరణం పాలయ్యారు. ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. సమీప భవనాలపై మోహరించి ఉన్న సీక్రెట్ సర్వీస్ స్నైపర్లు తక్షణం స్పందించి దుండగున్ని కాల్చి చంపారు. అతన్ని 20 ఏళ్ల థామస్ మాథ్యూ క్రూక్స్ అనే యువకునిగా గుర్తించారు. అతను కాల్పులకు తెగబడేందుకు కారణం తెలియాల్సి ఉంది. అమెరికా వంటి అగ్ర రాజ్యంలో మాజీ అధ్యక్షుని స్థాయి నేతపై ఇంత సమీపం నుంచి కాల్పులు జరగడం ఘోర భద్రతా వైఫల్యమేనంటున్నారు. ఈ ఘటనపై ఎఫ్‌బీఐ పూర్తిస్థాయిలో దర్యాప్తు జరుపుతోంది. ట్రంప్‌పై దాడితో ప్రపంచం నివ్వెరపోయింది. హత్యా యత్నాన్ని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, ఉపాధ్యక్షురాలు కమలా హారిస్, ప్రధాని నరేంద్ర మోదీతో సహా దేశాధినేతలంతా ఈ ఘటనను ఖండించారు.

### దేవుడే కాపాడాడు: ట్రంప్

ప్రాణాంతక దాడి నుంచి తనను భగవంతుడే రక్షించాడని ట్రంప్ అన్నారు. కాల్పుల ఘటనపై తన సొంత సోషల్ మీడియా 'ట్రూత్'లో ఆయన స్పందించారు. కాల్పుల్లో మరణించిన, గాయపడ్డ వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. "నిర్భయంగా ముందుకెళ్దాం. ఈ సమయంలో అమెరికన్లమంతా మరింత సమైక్యంగా నిలబడాల్సిన అవసరముంది. అమెరికన్లుగా మన వ్యక్తిత్వాన్ని చాటాల్సిన, దుష్టశక్తి గెలవకుండా అడ్డుకోవాల్సిన సమయమిది. మిమ్మల్ని, మన దేశాన్ని నేను త్రికరణశుద్ధిగా ప్రేమిస్తున్నా. త్వరలో విస్కాన్సిన్ సభ ద్వారా మీ అందరినీ ఉద్దేశించి మాట్లాడేందుకు ఉత్సాహంగా ఎదురు చూస్తున్నా" అని రిపబ్లికన్ పార్టీ మూడు రోజుల సదస్సును ఉద్దేశించి అన్నారు. ఈ సదస్సులో అధ్యక్ష అభ్యర్థిని అధికారికంగా ప్రకటించనుండటం తెలిసిందే.

### 120 మీటర్ల నుంచే కాల్పులు

ట్రంప్‌పై కాల్పుల ఘటనపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. కేవలం 120 నుంచి 150 మీటర్ల దూరం నుంచి కాల్పులు జరిగినట్టు ప్రాథమికంగా తేలింది. అత్యంత కట్టుదిట్టమైన భద్రతా వలయంలో ఉండే అమెరికా మాజీ అధ్యక్షునిపైకి ఇంత సమీపం నుంచి కాల్పులు జరపడం నమ్మశక్యం కాని విషయమని ఎఫ్‌బీఐ స్పెషల్ ఏజెంట్ కెవిన్ రోజెక్ అన్నారు. అంతమంది భద్రతా సిబ్బంది రక్షణలో ఉన్న ట్రంప్‌పైకి దుండగుడు అన్ని రౌండ్ల పాటు కాల్పులు జరపగలగడం వింతగా ఉందని అభిప్రాయపడ్డారు. "దుండగుడు అంత సమీపానికి ఎలా రాగలిగాడు, ఎవరు సహకరించారు వంటి కోణాల్లోనూ దర్యాప్తు జరుగుతుంది" అని చెప్పారు.

### దుండగుడు రిపబ్లికన్ ఓటరే

ట్రంప్‌పై కాల్పులకు తెగబడ్డ థామస్ మాథ్యూ క్రూక్స్ రిపబ్లికన్ పార్టీ ఓటరుగా నమోదు చేసుకున్నట్టు తేలడం విశేషం. అయితే 2021లో డెమొక్రటిక్ పార్టీ అనుబంధ విభాగానికి 15 డాలర్ల విరాళం ఇచ్చినట్టు కూడా వెల్లడైంది. కొద్ది రోజుల ముందే ట్రంప్‌ను ద్వేషిస్తూ, రిపబ్లికన్ పార్టీని విమర్శిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టాడట. క్రూక్స్‌ది పెన్సిల్వేనియాలో పిట్స్‌బర్గ్ శివార్లలోని బెథెల్ పార్క్ అని తేలింది. బతికుంటే ఈ నవంబర్లో అతను తొలిసారి ఓటు హక్కు వినియోగించుకునేవాడు. మృతదేహం వద్ద గుర్తింపు కార్డుల వంటివేవీ లభించకపోవడంతో అతన్ని గుర్తించడం ఏజెంట్లకు కష్టంగా మారింది. దాంతో చివరికి డీఎన్ఏ పరీక్ష చేసి గుర్తించారు.

### దుండగుని ముందస్తు ఏర్పాట్లు!

ట్రంప్‌పై కాల్పులకు తెగబడేందుకు దుండగుడు ముందుగానే పక్కాగా ఏర్పాట్లు చేసుకున్నట్టు భావిస్తున్నారు. దాడికి పాల్పడ్డ గోడౌన్ వంటి భవనం ర్యాలీకి అతి సమీపంలో ఉంది. దానిపైకి చేరుకునేందుకు ఒక నిచ్చెన కూడా ఏర్పాటు చేసి ఉంది. అతని మృతదేహం పక్కన పలు రకాలైన ప్యాకేజీలను పోలీసులు గుర్తించారు. వాటిలో పేలుడు పదార్థాలు ఉండొచ్చని అనుమానిస్తున్నారు.

### భీతావహంగా ఘటనా స్థలి

ట్రంప్‌పై హత్యా యత్నం జరిగిన బట్లర్ కేవలం 13 వేల జనాభా ఉండే చిన్న పట్టణం. పశ్చిమ పెన్సిల్వేనియాలో పిట్స్‌బర్గ్‌కు 33 మైళ్ల దూరంలో ఉంటుంది. ఆరుబయట మైదాన ప్రదేశంలో ర్యాలీ జరిగింది. తన మార్కు ఎర్ర టోపీ, నల్ల సూటులో ట్రంప్ వేదికపైకి చేరుకుని ప్రసంగం మొదలు పెట్టారు. అమెరికాలోకి అక్రమ వలసలు పెరిగిపోయాయంటూ చార్ట్ సాయంతో వివరిస్తుండగా కాల్పులు మొదలయ్యాయి. దాంతో అంతా ప్రాణభయంతో కేకలు వేశారు. తూటాలను తప్పించుకునేందుకు నేలపై పడుకుండిపోయారు. ఆ ప్రదేశమంతా భీతావహంగా మారింది. ట్రంప్‌ను సురక్షితంగా తరలించాక కూడా చాలాసేపటిదాకా జనం నేలపై పడుకునే కన్పించారు. అనంతరం భద్రతా సిబ్బంది రంగప్రవేశం చేసి ర్యాలీ వేదికను అదుపులోకి తీసుకున్నారు. ట్రంప్‌పై కాల్పులకు దిగిన దుండగుడు క్రూక్స్‌ను తాము ముందే చూసినట్టు సభికుల్లో పలువురు వెల్లడించారు. అతడు గోడౌన్‌పై నెమ్మదిగా కదులుతూ ట్రంప్‌కు వీలైనంత సమీపంగా వచ్చినట్టు ఇద్దరు ప్రత్యక్ష సాక్షులు వెల్లడించారు. కాల్పులకు ముందే క్రూక్స్ చేతిలో తుపాకీని స్పష్టంగా చూసినట్టు మరో ప్రత్యక్ష సాక్షి చెప్పాడు. "దేవుడా! అతని చేతిలో తుపాకీ ఉందంటూ అరిచా. అంతలోనే కాల్పులకు తెగబడటంతో వెంటనే నేలపై పడుకుని తలెత్తి చూశా. ఏజెంట్ల తూటాలకు అతని తల పేలిపోవడాన్ని కళ్లారా చూశా" అని చెప్పుకొచ్చాడు. అధ్యక్ష ఎన్నికల రేసులో ఇప్పటికే దూసుకుపోతున్న ట్రంప్ విజయావకాశాలు కాల్పుల ఉదంతం నేపథ్యంలో మరింతగా పెరిగినట్టు చెబుతున్నారు. ఆయన విజయావకాశాలు గత 24 గంటల్లోనే 8 శాతం పెరిగి ఏకంగా 70 శాతానికి చేరినట్టు రాజకీయ అంచనాల వేదిక పాలీమార్కెట్ పేర్కొంది. అంతటి ప్రాణాపాయ పరిస్థితిలోనూ ట్రంప్ అత్యంత వీరోచితంగా వ్యవహరించారంటూ అన్నివైపుల నుంచీ ప్రశంసల వర్షం కురుస్తోంది. "తల పక్కనుంచి తూటాలు దూసుకెళ్లాయి. ఒకటి చెవిని ఛిద్రం చేసింది. అయినా ట్రంప్ అస్సలు భయపడలేదు. ప్రాణాలు కాపాడుకోవడానికి మోకాళ్లపై పాక్కుంటూ పోవడం వంటివేవీ చేయలేదు. ఏ మాత్రం వెరవకుండా తిరిగి లేచి నుంచున్నారు. భద్రతా సిబ్బందిని నిలువరించి మరీ పిడికిలి బిగించి పోరాట నినాదాలు చేశారు" అంటూ పలువురు మద్దతుదారులు ప్రశంసిస్తున్నారు.

# విద్య ద్వారా యువతులకు,మహిళలకు సాధికారత



జనసముద్రం న్యూస్,, జ్ఞానపురం, విశాఖపట్నం,జూలై14మనం మన లక్ష్యాన్ని సాధించాలనుకుంటే, విజ్ఞానం ఆయుధంతో మనల్ని మనం శక్తివంతం చేసుకుందాం. విశాఖపట్నంలోని సెయింట్ జోసెఫ్ కాలేజ్ ఫర్ ఉమెన్ యొక్క మహిళా సాధికారత సెల్, చరిత్రలో అతి పిన్న వయస్కుడైన నోబెల్ బహుమతి గ్రహీత, స్త్రీలు మరియు పిల్లల విద్య కోసం, మానవ హక్కుల కోసం అలసిపోని పోరాటం చేస్తున్న మానవ హక్కుల న్యాయవాది మలాలా యూసఫ్‌జాయ్‌కు గుర్తింపుగా జూలై 12న, “అంతర్జాతీయ మలాలా దినోత్సవాన్ని” జరుపుకుంది. ఈ సందర్భంగా అతిథి మరియు ముఖ్యమైన వక్తగా వృక్షశాస్త్ర విభాగం హెచ్ఓడీ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కె.మాణిక్య కుమారిని ఆహ్వానించారు. విద్యార్థినులు, అధ్యాపకులను ఉద్దేశించి డాక్టర్ మాణిక్య కుమారి మాట్లాడుతూ మహిళా సమానత్వం, పౌర హక్కులు, ప్రజాస్వామ్యం అన్నీ నిరంకుశత్వానికి లోనవుతున్నాయన్నారు. మహిళా సాధికారత తరచుగా ప్రజాస్వామ్యం యొక్క పరిణామంగా పరిగణించబడు తున్నప్పటికీ, విద్యావంతులైన మరియు రాజకీయంగా చురుకైన మహిళలు ప్రజాస్వామ్యానికి అవసరమైన పూర్వగామి అని ఎక్కువ మంది ప్రజలు గుర్తించడం ప్రారంభించారు. గత శతాబ్దంలో, మహిళలు ఓటు హక్కును గెలుచుకున్నారు మరియు విద్య, ఆర్థిక అవకాశాలు, పునరుత్పత్తి ఆరోగ్య సంరక్షణ మరియు లింగ సమానత్వానికి ప్రాప్యతను విస్తరించడానికి శ్రద్ధగా పనిచేశారు. “కత్తి కంటే కలం గొప్పది” అని నమ్ముతూ, పేదరికం, అజ్ఞానం, అన్యాయం, జాత్యహంకారం మరియు ప్రాథమిక హక్కులను హరించడమే స్త్రీ పురుషులిద్దరూ ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలని మలాలా ప్రచారం చేశారని ఆమె నొక్కి చెప్పారు. పాఠశాల నుండి బయలుదేరే సమయంలో తాలిబన్లు మలాలాను హత్య చేసేందుకు ప్రయత్నించారు అని ఆమె తెలియజేసారు. పాఠశాలలు, విద్య ప్రతి బిడ్డ భవిష్యత్తును ఉజ్వలంగా మారుస్తాయి. ఐక్యరాజ్యసమితిలో మలాలా వినిపించిన “ఒక బిడ్డ, ఒక ఉపాధ్యాయుడు, ఒక పుస్తకం మరియు ఒక పెన్ ప్రపంచాన్ని మార్చగలదు” అనే నినాదం ప్రపంచవ్యాప్తంగా ఉన్న విద్యావేత్తలు మరియు మేధావులందరికీ ప్రేరణగా మారింది. మహిళా సాధికారతకు, మంచి రేపటికి విద్య ఒక్కటే పరిష్కారం అని ఆమె అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రిన్సిపల్ డాక్టర్ షైజీ, మహిళా సాధికారత సెల్ ఇంచార్జి శ్రీమతి మేరీ విజయరత్న(ఫిజిక్స్), సభ్యులు డా.టోనియా గ్రేస్(ఇంగ్లీష్), శ్రీమతి వసంత(ఎకనామిక్స్), శ్రీమతి సౌజన్య(మ్యాథ్స్), శ్రీమతి అశ్విని(కెమిస్ట్రీ) విద్యార్థులు మరియు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

# ట్యూషన్ కేంద్రాల నిర్వాహకుల ప్రాంతీయ శిక్షణా శిబిరం



జనసముద్రం న్యూస్, కంచర పాలెం,విశాఖపట్నం, జూలై 14 13,14 జూలై రెండు రోజులు ప్రాంతీయ శిక్షణా శిబిరం కంచరపాలెం లో బి. ఎన్. ఆర్ ఫౌండేషన్ లో ఈ రోజు ఉదయం ప్రారంభం అయ్యింది. చదువు అనేది ఒక విద్యార్థిలో అంతర్గతంగా ఉన్న అనేక నైపుణ్యాలను, సృజనాత్మకతను వెలికి తీసేది. అందుకు తరగతి గది ఆయువు. ఉల్లాసంగా, ఉత్సాహంగా బోధన చేసే ప్రక్రియ ద్వారా ఈ సమాజానికి అత్యున్నతమైన వ్యక్తులను, ఉన్నతమైన పౌరలను అంది%శీ%చగలం. కానీ నేడు విద్యార్థులు నాణ్యమైన చదువు లేక నాసిరకమైన విద్యతో ఎందులోనూ నైపుణ్యం చూపలేని స్థితిలో వున్నారు. అందుకోసమే తలిదండ్రులు స్కూలు అనంతరం ట్యూషన్లకు పంపిస్తున్నారు. అవి కూడా అత్యధిక ఫీజుల తోనూ లేకపోతే కేవలం హోమ వర్క్ చేసే కేంద్రాలుగా వున్నాయి. పాఠశాల సిలబస్తో పాటు ప్రత్యేకంగా శాస్త్రీయ కోణంలో సిలబస్ ను చెప్పడం, వైజ్ఞానిక, సాంస్కృతిక కార్యక్రమాలను జోడించి విద్యార్థులను విజ్ఞాన వంతులుగా తీర్చిదిద్దడం కోసం వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ 2019 నుంచి ట్యూషన్ సెంటర్లు నిర్వహిస్తున్నది. ఇప్పుడు రాష్ట్ర వ్యాపితంగా ఆంధ్రప్రదేశ్ చిల్డ్రన్స్ క్లబ్స్ ద్వారా ఈ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నది. ఈ కేంద్రాలకు ఆసరా ఛారిటబుల్ సొసైటీ మరియు విశ్వ మానవ సంక్షేమ సంఘం సహకారం అందిస్తున్నాయి. మొదటి రోజు సెంటర్ల నిర్వహణలో అనుభవాలు, ట్యూషన్ టీచర్స్/ నిర్వాహకుల ప్రాధాన్యత, ఆవశ్యకత,చదువు ఎందుకు? చదువులో కథలు, పద్యాలు ప్రాధాన్యత? చదువులో ఆటలు, పాటలు, డ్యాన్సులు ప్రాధాన్యత ఏమిటి? అనే అంశాలు ఆక్టివిటీస్ ద్వారా నేర్పించడం జరిగింది. కార్యక్రమ నిర్వహణ సతీష్ చేయగా వివిధ అంశాలపై ఎల్లాజి, పార్ధ సారధి, నీలవేణి, గణేష్, కృష్ణవేణి, డి. శైలజ, రష్మిక ఇంటరాక్టివ్ సెషన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమములో విశాఖపట్టణం, అల్లూరు సీతారామరాజు, ఏలూరు, కృష్ణా జిల్లాల నుంచి పాల్గొన్నారు. చిల్డ్రన్స్ క్లబ్ నాయకులు వి.వి. జయ, డి. కొండమ్మ, కీర్తి, ఆశ్రిత, అప్పారావు, కృష్ణారావు, అ.మణి, అరుణ, ధాన్ ఫౌండేషన్ ఎం.కె ఎస్ నుంచి యు.లక్ష్మి పాల్గొన్నారు.

# అన్నదానం ఒక పవిత్ర సమర్పణ

## నేటి తరానికి పాణ్యం సుబ్రహ్మణ్యం స్వామి





రైల్వే కోడూరు జనసముద్రం న్యూస్ జులై 13 ఆంధ్రప్రదేశ్ అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గం ఓబులవారిపల్లి మండలం అప్పారావు సర్కిల్ కాశీనగరం జీవనజ్యోతి ఆనంద నిలయం శాశ్విత అన్నదాన ఆశ్రమంనేటి సమాజంలో కన్నతండ్రి కి కన్నతల్లికి భోజనం పెట్టకుండా చూస్తున్న ఈ సమాజంలో కులం మతం వర్ణం వర్గం ప్రాంతం రాజకీయం తేడా చూడకుండా శాశ్విత నిత్య అన్నదానం చేస్తున్న పాణ్యం సుబ్రహ్మణ్యం స్వామి నేటి తరానికి ఓ ప్రత్యేక ఆదర్శం వారు చేస్తున్న శాశ్విత నిత్య అన్నదానం సమయం అన్నది పాటించకుండా 24 గంటలు ఎప్పుడు దారిన వెళ్లేవారు ఆకలి అని వచ్చిన వారికి అన్నం పెడుతూ ఓ గొప్ప అద్భుత కార్యక్రమాన్ని కొనసాగిస్తున్న సుబ్రహ్మణ్యం స్వామి వారు చేస్తున్న అన్న సంతర్పణ ఒక నెలకు దాదాపు ఒక లక్షా 20 వేల రూపాయలు పైబడి ఖర్చులు అవుతున్నప్పటికీ వాటిని లెక్కచేయకుండా వారు నిల్వ ఉంచుకున్న పొదుపు మొత్తాలను వారి సొంత పొలములో వచ్చిన మొత్తాలను వారు ఎన్నో ఉద్యోగాలు చేయగా వచ్చిన మొత్తాలను ఖర్చు చేస్తూ శాశ్విత నిత్య అన్నదానమునకు కొరత లేకుండా వారి సొంత భూములను వేరొకరికి కుదవ ఉంచుతూ ఆ మొత్తాలను సైతం శాశ్విత నిత్య అన్నదానం జరిపిస్తూ వారు కారణజన్ముడై పుట్టారని ఆకలి తీర్చుకుంటున్న వారందరూ తెలుపుతున్నారు ఎంతోమంది పేదలను అక్కున చేర్చుకుంటూ ఆకలి తీరుస్తున్న ప్రత్యక్ష ఆ మహావిష్ణు పాణ్యం సుబ్రహ్మణ్యం స్వామి ద్వారా అన్న సంతర్పణ జరిపిస్తున్నారని ఆకలి తీర్చుకుంటున్న పెద్దలు అక్కడ ఉన్నవారు ఆ ప్రాంతాల ప్రజలు ఎవరి నోట విన్న ఆ మహావిష్ణు పాణ్యం సుబ్రమణ్యం స్వామి జీవనజ్యోతి ఆనంద నిలయం శాశ్విత నిత్య అన్నదాన ఆశ్రమం ద్వారా సూర్యచంద్రులు ఉన్నంతవరకు భోజనమునకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఎంతోమంది ఆకలి తీర్చుటకు సుబ్రహ్మణ్యం స్వామి కారణజన్ముడై పుట్టారని ఆ మహావిష్ణు వారి రూపంలో జరిపిస్తున్నారని అన్నం పరబ్రహ్మ స్వరూపం అన్నదానం మించిన మరో కార్యం లేదంటూ పితృదేవతలు సైతం పాణ్యం సుబ్రహ్మణ్యం స్వామిని ఆశీర్వదిస్తూ శాశ్విత నిత్య అన్నదానమునకు కొరత లేకుండా ఆ మహావిష్ణువు జరిపిస్తున్నారని జీవనజ్యోతి ఆనంద నిలయం శాశ్విత నిత్య అన్నదాన ఆశ్రమమునందు ఆకలి తీర్చుకుంటున్న ప్రతి ఒక్కరూ ప్రత్యేకంగా కోడై కోస్తూ ఉదయం తెల్లవారినప్పటినుండి రాత్రి ప్రజలు కనిపిస్తున్నంతవరకు శాశ్విత నిత్య అన్నదానం ఆ మహావిష్ణు పాణ్యం సుబ్రమణ్యం స్వామి రూపంలో జరిపిస్తున్నారంటూ ఎవరి నోట విన్న వారి మాటే వినిపిస్తుంది ప్రత్యేకంగా మీడియా వివరణ కోరగా మానవత్వం మన అందరిదీ, మానవసేవే మాధవసేవ, ప్రతి ఒక్కరూ పక్క వారి ఆకలి తీర్చడం లో అంతా ఆ మహావిష్ణు దైవ స్వరూపం అంటున్న పాణ్యం సుబ్రహ్మణ్యం స్వామి. వీరికి ప్రముఖ ఎన్నారై పేరుగాంచిన ట్రస్ట్ ప్రముఖుల నుండి ఆహ్వానం అందినప్పటికీ ఆ మహావిష్ణు నిర్ణయించిన రోజున తప్పకుండా కలుస్తాం అంటూ సమాధానం ఇస్తున్నారు

# వెల్దుర్తి మండలంలో సూపర్ సక్సెస్ అయిన డా.అంజిరెడ్డి హాస్పిటల్స్ వారి ఉచిత మెగా వైద్య శిబిరం



జనసముద్రం న్యూస్, జులై 14, పల్నాడు జిల్లా, మాచర్ల నియోజకవర్గం, వెల్దుర్తి మండలం. మండల కేంద్రమైన వెల్దుర్తి లోని బాబు శ్రీ దివి రంగణాదాచార్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 14.7.24 అనగా ఆదివారం జరిగిన నర్సరావుపేట అంజిరెడ్డి హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి ముఖ్య అతిథిగా మాచర్ల నియోజకవర్గ ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సతీమణి శోభారాణి హాజరై ప్రారంభించారు. అదేవిధంగా రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు.ఈ ఉచిత మెగా వైద్య శిబిరంకు ప్రముఖ సూపర్ స్పెషలిస్ట్ డాక్టర్ లోకిరెడ్డి శ్రీనివాస రెడ్డి , గ్యాస్ట్రో ఎంటరాలజీ మరియు కార్డియాలజీ విభాగం డాక్టర్ కోటా శబరి గిరీష్ , క్రిటికల్ కేర్ జనరల్ మెడిసిన్ విభాగం సంబంధించి డాక్టర్ చింత కృష్ణ చైతన్య , స్త్రీ సంబంధిత వ్యాధులకు సంబంధించి డాక్టర్ లోకిరెడ్డి సుష్మారెడ్డి మరియు సృజన , ఆర్థోపెడిక్ డాక్టర్ చెన్నారెడ్డి , ఈ.యన్. టీ విభాగం డాక్టర్ వేపూరి రాజేష్, డాక్టర్ రజిత , జనరల్ సర్జరీ విభాగానికి సంబంధించి డాక్టర్ శివతేజ హాజరయ్యి ఈ వైద్య శిబిరంలో ఉచితంగా ఓపి చూసి మరియు రక్త పరీక్షల తో పాటు ఈసీజీ, 2%ణ% ఎకో టెస్టులను ఉచితంగా చేసి 450 మంది రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఇలాంటి వైద్య శిబిరాలు మునిపెన్నడు వెల్దుర్తి మండల స్థాయిలో నిర్వహించలేదని మొట్టమొదటిసారిగా డాక్టర్ అంజిరెడ్డి హాస్పిటల్ వారు మెడికల్ ఎక్విప్మెంట్ ఈ.సి.జి, 2%ణ% ఎకో, అల్ట్రా సౌండ్, ఎండొస్కోపీ మొదలగు వైద్య పరికరాలను ఈ వైద్య శిబిరమునకు తీసుకొని వచ్చి రోగులకు వ్యాధి నిర్ధారణ చేసి 450 మంది రోగులకి ఉచితంగా మందులు పంపిణీ చేయడం చాలా సంతోషంగా ఉందని మండలంలోని ప్రజలందరూ డాక్టర్ అంజిరెడ్డి హాస్పిటల్ యొక్క వైద్య సేవలను కొనియాడారు. ఈ ఉచిత వైద్య శిబిరంకు డా. అంజిరెడ్డి హాస్పిటల్ పరిపాలన అధికారి పరిటాల సత్యనారాయణ , పిఆర్ఓ కోటేశ్వరరావు , టిడిపి కార్యకర్తలు, జూలకంటి పోలిరెడ్డి గారి వెంకట్ రెడ్డి గారు, పులుసు వీరా రెడ్డి , పులుసు గురవా రెడ్డి , కేశిరెడ్డి వెంకటరెడ్డి , కాయతి నాగిరెడ్డి , కోట్ల శ్రీనివాస్ రెడ్డి , జూలకంటి జయరామిరెడ్డి పాల్గొన్నారు.

# మాజీ పిఏసిఎస్ ఛైర్మన్ పడిగెపాటి కోటిరెడ్డిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే భాస్కర్ రావు.



దామరచర్ల మండలం.జులై 14.(జనసముద్రం న్యూస్):దామరచర్ల మండల బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ పిఎసిఎస్ ఛైర్మన్ పడిగేపాటి కోటి రెడ్డి గత కొంత కాలముగా మెడ నరాల నొప్పితో బాధపడుతూ ఇటీవలే హైదరాబాద్ లోని ప్రముఖ ఆసుపత్రి నందు మెడ నరాల శస్త్ర చికిత్స చేయించుకొని తన స్వగృహము నందు విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బిఆర్ఎస్ పార్టీ మిర్యాలగూడ నియోజక వర్గ ఇంచార్జ్ నల్లమోతు భాస్కర్ రావు వారి ఇంటికి చేరుకొని పడిగేపాటి కోటి రెడ్డి ని పరామర్శించి ఆరోగ్య యోగక్షేమాలు అడిగి తెలుసకున్నారు.అనంతరం డాక్టర్లు చెప్పిన సూచనలు పాటించి అతి తొందర్లోనే ప్రజాక్షేత్రంలోకి రావాలని ఆకాంక్షించారు.వారి వెంట తాజా మాజీ జెడ్పీ కో-ఆప్షన్ మెంబర్ ఎండి. మోషీన్ అలీ,తాజా మాజీ జెడ్పీటీసీ అంగోతు లలిత హాతీరాం నాయక్,తాజా మాజీ ఎంపీటీసీ లు బాల లక్ష్మీ సత్యనారాయణ,సోము సైదిరెడ్డి,వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కందుల నాగి రెడ్డి,బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి దారగాని వెంకటేశ్వర్లు,బాల శ్రీనివాస్ నాయుడు,పగిడి కొండలు,కందుల నారాయణ రెడ్డి, యూత్ నాయకులు రఫీ భాయ్, హాజీ,కొండారపు మహేష్,పడిగేపాటి రాంరెడ్డి, పడిగేపాటి వెంకటరెడ్డి మరియు కుటుంబ సభ్యులు తదితరులు ఉన్నారు.



# తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో మంత్రివర్యులు కి శుభాకాంక్షలు తెలుపున నాయకులు

జనసముద్రం న్యూస్ ఏలూరు జిల్లా ప్రతినిధి జులై 14 మంగళగిరి లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తెలుగుదేశం పార్టి అద్యక్షులుగా నియమితులైనా శ్రీ. పల్లా శ్రీనివాసరావు ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెవెన్యూశాఖ శాఖా మంత్రివర్యులు అనగాని సత్యప్రసాద్ లను మర్యాద పూర్వకంగ కలసి ద్వారకాతిరుమల ( చిన్న తిరుపతి ) శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దుస్సాలువ కప్పి శ్రీ స్వామి వారి తీర్థ ప్రసాదాలు వారికి అందజేసి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో గోపాలపురం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ తెలుగు మహిళా కార్యనిర్వహక కార్యదర్శి పొనుకుమాటి శ్రీ సంధ్య ,ద్వారకాతిరుమల మండలం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కొత్తపల్లి సుబ్బారావు , యంత్రపాటి తిరుమల , తెలుగుదేశం పార్టీ యవ కార్యకర్తలు యంత్రపాటి శివాజి ,యంత్రపాటి నరేంద్ర , కొత్తపల్లి కిషోర్ , కొత్తపల్లి నవీన్ కుమార్ తధితరులు పాల్గొన్నారు

# నందలూరు వద్ద ఆర్టిసి బస్సు.. లారీ... యాక్సిడెంట్ కండక్టర్ లారీ డ్రైవర్ మృతి.

## మానవత్వం చాటుకున్న రాజంపేట పార్లమెంటు ఇంచార్జ్ యల్లటూరు శ్రీనివాసరాజు



అన్నమయ్య జిల్లా ఇన్చార్జి న్యూస్ రిపోర్టర్ జూలై 14 జన సముద్రం న్యూస్ఉమ్మడి కడప జిల్లా రాజంపేట నియోజకవర్గంనందలూరు మండలం మూతపడిన ఆల్విన్ కర్మాగారం సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఘోర రోడ్డు ప్రమాదం..తిరుపతి నుంచి జమ్మలమడుగు కి వెళుతున్న ఆర్టీసీ బస్సు, కడప వైపు నుంచి వస్తున్న లారీ ఢీ..బస్సు కండక్టర్ రాముడు (40) లారీ డ్రైవర్ అక్కడికక్కడే మృతి, 20 మంది ప్రయా ణికులకు గాయాలు..గాయపడిన వారిని108 వాహనంలో రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి ప్రాథమిక చికిత్స కోసం తరలింపు..ప్రభుత్వ ఆసుపత్రిలో క్షత గాత్రు లకును పరామర్శించి మెరుగైన వైద్యం కోసం ఉచిత ప్రవేటు అంబులెన్సు ఏర్పాటు చేసిన యల్లటూరు శ్రీనివాస రాజు మానవత్వం చాటుకున్నారు



# భువనగిరి ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసిన డా. బొజ్జ సూర్య నారాయణ రెడ్డి

యాదాద్రి భువనగిరి జిల్లా (జూలై.14)జనసముద్రం న్యూస్ భువనగిరి:-తెలంగాణా ప్రైవేట్ డిగ్రీ,పీజీ కళాశాలల మేనేజ్మెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ బొజ్జ సూర్య నారాయణ రెడ్డి హైదరాబాద్ లో భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డిని మర్యాద పూర్వకంగా వారి నివాసంలో కలిసి శాలువతో సన్మానించారు.ఈ సందర్భంగా ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డికి ప్రైవేట్ డిగ్రీ,పీజీ కళాశాలల పరిస్థితులను వివరించారు.ఫీజు రియంబర్స్ మెంట్,ఉపకార వేతన బకాయిలు రాక కళాశాల అద్దెలు చెల్లించలేక యాజమాన్యం వారు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు.మీ ద్వారా మా కళాశాల వాళ్ళ ఇబ్బందులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,మంత్రుల దృష్టికి తీసుకొని పోయి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.విషయం చెప్పగానే ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి వెంటనే సానుకూల స్పందిస్తూ డిగ్రీ,పీజీ కళాశాలల సమస్యలు నాకు తెలుసు అని తప్పకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకొని పోతా అని ఇది ఒక్క భువనగిరి పార్లమెంట్ పరిధి సమస్య కాదు అని రాష్ట్రం మొత్తం ఇవే ఇబ్బందులు పడుతున్న కళాశాలలకు మా ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొని పోయి పరిష్కరిస్తా అని హామీ ఇచ్చిన ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డికి డాక్టర్ సూర్య నారాయణ రెడ్డి రాష్ట్ర డిగ్రీ,పీజీ కళాశాలల తరుపున ధన్యవాదాలు తెలిపారు.



# శ్రీకృష్ణ అలంకరణలో జగన్నాథుడు

(జనసముద్రం న్యూస్ గోపాలపురం నియోజకవర్గం ప్రతినిధి) ద్వారకాతిరుమల, జులై 14:ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రసిద్ధిగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రంద్వారకాతిరుమలచిన్న వెంకన్న ఆలయానికి ఉపాలయమైన లక్ష్మీపురం గ్రామంలో శ్రీ వెంకటేశ్వర సంతాన వేణుగోపాల జగన్నాథ స్వామి వారి ఆలయంలో శ్రీ జగన్నాథ స్వామి వారి రథోత్సవం అత్యంత వైభవముగా నిర్వహిస్తున్నారు.శ్రీ వైఖానస ఆగమ విధిగా దశావతార అలంకారాలలో భాగంగా 8వ రోజు స్వామివారు చేతిలో పిల్లను గోవి ఊదుతూ శ్రీ కృష్ణవతార అలంకారంలో భక్తులకు దర్శన భాగ్యాన్ని కల్పించారు.స్వామివారిని దర్శించుకున్న భక్తులు మంత్రముగ్ధులై శ్రీకృష్ణ నామస్మరణలతో పూజలు నిర్వహించారు భక్తులకు ఆలయ అర్చకులు స్వామివారి తీర్థప్రసాదాలను అందించారు.

# వైకాపా పార్టీకి...?? వైఎస్ రాజశేఖర్ రెడ్డి కి సంబంధం లేదు

**-జగన్ చేసిన తప్పులకి...? స్వర్గీయ వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాలు కొల్చడం సరైనది కాదు**

**-రాజశేఖర్ రెడ్డి ఆసియాలను... జగన్ విస్మరించారు.. అందుకే ప్రజలు బుద్ధి చెప్పారు**

**-ఆంధ్ర రత్న భవన్లో విలేకరుల సమావేశంలో ఏపీ సి సి అధ్యక్షురాలు షర్మిల ధ్వజం**



అన్నమయ్య జిల్లా ఇన్చార్జి న్యూస్ రిపోర్టర్ జూలై 14 జనసముద్రం న్యూస్అమరావతి న్యూస్:- వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయాలను జగన్ తుంగలో తొక్కడంతోనే ప్రజలు వైకాపాను గొయ్యి తీసి పాతిపెట్టారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ధ్వజమెత్తారు. 'వైకాపా ప్రభుత్వం వైఎస్ మొదలు పెట్టిన జలయజ్ఞాన్ని విస్మరించింది. ఆయనకు ఇష్టమైన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంలో రూ.4వేల కోట్లు బకాయిలు పెండింగులో ఉంచింది. చిక్కీలు, కోడిగుడ్లు, ఆఖరికి యూనిఫాంలకు కూడా డబ్బులు చెల్లించలేదు. వైకాపా నాయకులు హత్యారాజకీయాలు, గూండాయిజం చేసి ఉండొచ్చు. దానిని కాదనట్లేదు. కానీ దానికీ వైఎస్‌కు ఏం సంబంధం? ఆయన విగ్రహాలను ధ్వసం చేయడం న్యాయమా?' అని ఆమె ప్రశ్నించారు. వైఎస్ విగ్రహాలను ధ్వసం చేస్తే అక్కడికెళ్లి ధర్నా చేస్తామని హెచ్చరించారు. విజయవాడలోని ఆంధ్రరత్న భవన్‌లో వైఎస్ షర్మిల శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. 'రాజశేఖరరెడ్డికి విశాఖ స్టీల్ ప్లాంట్ ఇష్టమైన ప్రాజెక్టని తెలిసి కూడా అయిదేళ్లుగా ముఖ్యమంత్రిగా ఉన్న జగన్ ఆ సంస్థని కాపాడటానికి ప్రయత్నించలేదు. పైగా అది నష్టాల్లో ఉందా అని తెలియనట్లు అడిగారు' అని మండిపడ్డారు. 'వైకాపా తోకపార్టీ. భాజపాకు ఊడిగం చేసి, ప్రతి బిల్లుకూ మద్దతిచ్చింది. భాజపాకు సంబంధించిన వ్యాపారులు, నాయకులకు రాజ్యసభ.. తితిదేలో.. ఏది అడిగితే ఆ పదవులు ఇచ్చింది. అధికారంలో ఉన్నప్పుడు ప్రత్యేక హోదాతో పాటు రాష్ట్ర భవిష్యత్తును వైకాపా తాకట్టుపెట్టింది. లోక్‌సభ స్పీకర్ ఎన్నికలోనూ జగన్ భాజపాకు మద్దతిచ్చారు. మణిపుర్ ఘటనతో సహా ఏది చూసినా జగన్ భాజపాతోనే ఉన్నారు. భాజపాకు తొత్తుగా, తోకపార్టీగా ఉన్నది వైకాపానే' అని షర్మిల ధ్వజమెత్తారు. తెదేపాకు కాంగ్రెస్‌కు సంబంధం లేదని ఆమె స్పష్టం చేశారు.

## బూర్జువా, కమ్యూనిస్టు రాజకీయాలపై ప్రజలలో రాజకీయ చైతన్యం తీసుకురావాలి: సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు

జనసముద్రం న్యూస్ ప్రతినిధి మధిర జూలై 14,బూర్జువా, కమ్యూనిస్టు రాజకీయాలపై ప్రజలలో రాజకీయ చైతన్యం తీసుకురావాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు అన్నారు. మధిర మండల పరిధిలోని దెందుకూరు లోనే శ్రీరస్తు ఫంక్షన్ హాలు నందు సిపిఎం జిల్లాస్థాయి రాజకీయ శిక్షణ తరగతులు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ రాజకీయ శిక్షణ తరగతుల ప్రారంభ సూచికంగా సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు సిపిఎం పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం రాజకీయ శిక్షణ తరగతులను పోతినేని సుదర్శన్ రావు ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రస్థాయి నుంచి మండల స్థాయి వరకు సిపిఎం రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహిస్తుందన్నారు. ఈ రాజకీయ శిక్షణా తరగతులలో ప్రస్తుత రాజకీయ పరిణామాలపై అవగాహన కల్పించేందుకే ఈ రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ రాజకీయ శిక్షణ తరగతుల వలన దేశంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలపై పూర్తి అవగాహన కలుగుతుందన్నారు. ప్రస్తుతం, వర్తమాన రాజకీయాలపై అవగాహన లేకుండా కమ్యూనిస్టు రాజకీయాలు చేయలేమన్నారు. రాజకీయ సిద్ధాంతం లేకుండా కమ్యూనిస్టులు ముందుకు పోలేరన్నారు. ఇటీవల జరిగిన లోకసభ, శాసనసభ ఎన్నికలలో అనేక పరిణామాలు చోటు చేసుకున్నాయన్నారు. ఆ పరిణామాలపై కమ్యూనిస్టు కార్యకర్తలు పూర్తి అవగాహన కలిగి ఉండకపోతే కమ్యూనిస్టుగా మనకు నష్టం జరుగుతుందన్నారు. ఈ రెండు ఎన్నికలలో తెలంగాణ రాష్ట్రంలో బిజెపి ఒక ప్రధానమైన శక్తిగా ఎదిగిందన్నారు. ఎవరు ఊహించని విధంగా ఎనిమిది పార్లమెంటు స్థానాలను గెలిచిందన్నారు. బిజెపి గెలుపు కమ్యూనిస్టు రాజకీయాలకు ప్రమాదకరమన్నారు. రాష్ట్ర, దేశ రాజకీయాల్లో అనేక అనూహ్య రాజకీయ పరిణామాలు వేగంగా ముందుకు వెళుతున్నాయన్నారు. వర్తమాన, భవిష్యత్తు రాజకీయాలపై కమ్యూనిస్టు నాయకులు, కార్యకర్తలు అవగాహన పెంచుకోవాలన్నారు. బూర్జువా రాజకీయాలు రాష్ట్ర ప్రజలకు నష్టం కలిగిస్తాయన్నారు. కమ్యూనిస్టు రాజకీయాలు ప్రజలకు మేలు చేస్తాయన్నారు. ఈ విషయాలపై కమ్యూనిస్టు నాయకులకు, కార్యకర్తలకు అవగాహన లేకపోతే ప్రజలలో అవగాహన కల్పించలేమన్నారు. మూడు రోజులపాటు నిర్వహించనున్న ఈ జిల్లాస్థాయి రాజకీయ శిక్షణ తరగతులకు హాజరైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, భవిష్యత్తు పోరాటాలకు




పునాది వేసుకోవడానికి ఈ రాజకీయ శిక్షణ తరగతులు ఉపయోగపడతాయన్నారు. ఈ రాజకీయ శిక్షణ తరగతుల వల్ల కమ్యూనిస్టు అనే వ్యక్తికి రాజకీయంగా ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. బిజెపి అనుసరిస్తున్న మతోన్మాద విధానాలను క్షేత్రస్థాయిలో కమ్యూనిస్టులు మాత్రమే ప్రజలకు వివరించగలుగుతారన్నారు. మిగతా బూర్జువా రాజకీయ పార్టీలకు అధికారం తప్ప ప్రజా ప్రయోజనాలు పట్టవన్నారు. దేశవ్యాప్తంగా బిజెపి మతోన్మాద విధానాలతో ముందుకు సాగుతుందని, ఇది దేశ ప్రయోజనాలకు ప్రమాదకరమన్నారు. ఈ ప్రమాదం గురించి ప్రజలలో రాజకీయ చైతన్యం తీసుకురావాల్సిన అవసరం కమ్యూనిస్టులపైనే ఉందన్నారు. ఈ శిక్షణ తరగతులలో సిపిఎం జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వరరావు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎర్ర శ్రీకాంత్, బొంతు రాంబాబు, బుక్య వీరభద్రం, యనమదల విక్రమ్, కళ్యాణం వెంకటేశ్వరరావు, రాష్ట్ర నాయకులు మన్నేపల్లి సుబ్బారావు జిల్లా ఎకడమిక్ సెల్ సభ్యులు బండారు రమేష్ మధిర మండల నాయకులు శీలం నరసింహారావు, మంద సైదులు, మండవ ఫణీంద్ర కుమారి, అనుమోలు భాస్కరరావు, పాపినేని రామ నరసయ్య, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు, మండల కమిటీ సభ్యులు, ప్రజాసంఘాల ఫ్రాక్షన్ కమిటీ సభ్యులు, శాఖ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



## జూలకంటి బ్రహ్మారెడ్డి గెలిచిన సందర్భంగా అమ్మవారికి మొక్కులు చెల్లించిన టీడీపీ శ్రేణులు

కాకతీయ న్యూ, జులై 14, పల్నాడు జిల్లా, దుర్గి మండలం.జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఎమ్మెల్యే గా భారీ మెజారిటీ తో గెలిచినా సందర్భంగా టీడీపీ సీనియర్ నాయకులు,మాచర్ల మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జున రావు ఆధ్వర్యంలో నిదానంపాటి శ్రీ లక్ష్మి అమ్మవారి దేవస్థానం ( అడిగోప్పల )నందు మొక్కు చెల్లించుకున్న దుర్గి రాజానగరం తండా తెలుగుదేశం పార్టీ శ్రేణులు కేతావత్ రామోజీ నాయక్, రాము నాయక్, జరపల జ్యోతి, మంత్రు నాయక్, బద్దు నాయక్, గోవిందు నాయక్, జరపాల సోమ్లా నాయక్ . వారిని మాచర్ల మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## పోచమ్మ అమ్మవారికి పూజలు

జన్నారం మండల విలేఖరి, జన సముద్రం న్యూస్, జూలై 14

జన్నారం మండలంలోని పోన్కల్ గ్రామంలో మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఆదివారం జన్నారం పట్టణానికి చెందిన మున్నూరు కాపు సంఘం నాయకులు, కులస్తులు బోనాలు ధరించి గ్రామంలోని పోచమ్మ అమ్మవారి దేవాలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం దేవాలయంలోని పోశమ్మ అమ్మవారికి బోనాలను నైవేద్యంగా సమర్పించారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం నాయకులు, కులస్తులు పాల్గొన్నారు.



## 5వేల రూపాయలు ఆర్థిక సహాయం

చొప్పదండి(జనసముద్రం న్యూస్):చొప్పదండి మండల కేంద్రానికి చెందిన గౌడ కులస్తుడు బుర్ర రాజు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆదివారం గౌడ యువజన సంఘం ఆధ్వర్యంలో వారి కుటుంబానికి 5000 రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షులు పెరమండ్ల గంగయ్య, గౌడ యువజన సంఘం అధ్యక్షులు బొడిగె గంగరాజు, గౌరవ అధ్యక్షులు బత్తిని ప్రశాంత్, చేపూరి సత్యనారాయణ, బొడిగె ప్రవీణ్, బుర్ర హరీష్, బొడిగె శ్రీనివాస్, బొడిగె సాయి కృష్ణ, బొడిగె శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## పెట్రోల్ బంకుల నిర్వాహకులు ఉచిత సేవల నిబంధనలను పాటించడం లేదని ఫిర్యాదులు ఇస్తే

### చిన్న చిన్న వాటిని పట్టించుకోవద్దని అంటున్న పెద్దపల్లి డిసిఎస్ఓ ప్రేమ్ కుమార్



జనసముద్రం : జూలై 14 ( పెద్దపల్లి జిల్లా ఇంచార్జ్ )పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా పెట్రోల్ బంకులలో కల్పించాల్సిన 6 ఉచిత సేవలను నిబంధనల ప్రకారం కొన్ని పెట్రోల్ బంకు నిర్వాహకులు కల్పించడం లేదని అడిగితే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కొన్ని పెట్రోల్ బంకుల్లో కొట్టే పెట్రోల్ లో తీసుకునే రూపాయలలో మోసాలకు పాల్పడుతున్నారని పెద్దపల్లి జిల్లాకు చెందిన స.హా. చట్టం కార్యకర్త , సోషల్ వర్కర్ రెండు సార్లు పెట్రోల్ బంకులపై పెద్దపల్లి జిల్లా పౌర సరఫరాల అధికారి ప్రేమ్ కుమార్ కు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని చర్యల విషయం పక్కన పెడితే చిన్న చిన్న సమస్యలను పట్టించుకోవద్దని దరఖాస్తు చేసిన అతనికే ఉచిత సలహా ఇచ్చాడు. నెలలు గడుస్తున్న ఇచ్చిన ఫిర్యాదుల పై చర్యలు శూన్యం. మంచిర్యాల జిల్లా నుండి ప్రేమ్ కుమార్ పెద్దపల్లికి బదిలీ అయినప్పటి నుండి ఇప్పటి వరకు కూడా పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా పెట్రోల్ బంకులపై తనిఖీ చేయడం లేదు . ప్రత్యేకించి పెట్రోల్ బంకులపై ఫిర్యాదులు వస్తే సత్వరం స్పందించడం లేదు. ఫిర్యాదులను పక్కన పెడుతున్నారు. పెట్రోల్ బంకుల్లో వసతులపై తనిఖీలు ఎక్కడ ?జిల్లా వ్యాప్తంగా పెట్రోల్ బంక్ లో ఉచిత సౌకర్యాలు బంకు నిర్వాహకులు కల్పించడం లేదు. ఉచిత సౌకర్యాల కల్పనపై నిబంధనలు ఉన్నప్పటికీ వాటిపై సరైన అవగాహన కొరకు అవగాహన సదస్సులు పౌర సరఫరాల శాఖ ద్వారా ఏర్పాటు చేయడం లేదు. పలుమార్లు జిల్లా పౌర సరఫరాల అధికారి కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదుల పై వివరణ అడిగితే స్పందించాల్సిన అధికారి విధుల నిర్లక్ష్యం చేస్తున్నారు. గతంలో కూడా జిల్లా వ్యాప్తంగా మొత్తం పెట్రోల్ బంకుల వివరాలను ఆర్ టి ఐ దరఖాస్తు ద్వారా బొబ్బిలి సత్యనారాయణ పెద్దపల్లి జిల్లా పౌరసరఫరాల అధికారి కోరగా సరైన సమాచారం కూడా ఇవ్వలేదు. ఆ కార్యాలయంలో పెట్రోల్ బంకుల వివరాలు కూడా అందుబాటులో లేవు. పెట్రోల్ బంకుల పై ఇచ్చే ఫిర్యాదులపై విధుల నిర్లక్ష్యం వహిస్తున్న పెద్దపల్లి జిల్లా పౌర సరఫరాల అధికారి ప్రేమ్ కుమార్ పై జిల్లా కలెక్టర్ సమగ్ర విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని బొబ్బిలి సత్యనారాయణ కోరారు.





## వైసిపి ముసలోడు మగాడ్రా.... బుజ్జి

**మాజీ వైసిపి ఎంపీలు లో ఇతను స్టైలే వేరప్పా**

**వాడుకున్నోళ్లకు వాడుకున్నంత...?? అబ్బో చెప్పలేకుండాము మామ**

**దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శాంతి... తన భర్త మదన్మోహన్ దేవాదాయ శాఖ కమీషనర్ సత్యనారాయణకు ఫిర్యాదు**

అన్నమయ్య జిల్లా ఇన్చార్జి న్యూస్ రిపోర్టర్ జూలై 14 జనసముద్రం న్యూస్ వైసీపీ కీలక నేత, రాజ్యసభ సభ్యుడు విజయసాయి రెడ్డిపై సంచలన ఫిర్యాదు నమోదు అయింది. దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శాంతిపై ఆమె భర్త మదన్ మోహన్ దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణకు ఫిర్యాదు చేశారు...తాను విదేశాల్లో ఉండగా తన భార్య గర్భం దాల్చిందని ఫిర్యాదులో పేర్కొన్నాడు. తన భార్య గర్భానికి వైసీపీ ఎంపీ విజయసాయి రెడ్డి, గవర్నమెంట్ ప్లీడర్ సుభాష్ లే కారణం అని సంచలన ఆరోపణలు చేశారు. తన భార్య అక్రమ సంతానానికి తండ్రెవరో తేల్చాలంటూ దేవదాయ శాఖ కమిషనరును కోరుతూ లేఖ రాశారు. ఇదిలా ఉంటే ఇటీవలే దేవదాయ శాఖ కమిషనర్ శాంతిని సస్పెండ్ చేశారు..!!!!!



## బీబీనగర్ లో దొంగల బీభత్సం

యాదాద్రి భువనగిరి జిల్లా జూలై.14,భువనగిరి నియోజకవర్గ ప్రతినిధి:జనసముద్రం న్యూస్ బీబీనగర్ మండల కేంద్రంలోని ఓ ఇంటిలో శనివారం అర్ధరాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు.పట్టణంలో తాళం వేసిన ఇంటి తాళాన్ని పగలగొట్టి బంగారు ఆభరణాలు,నగదు ఎత్తుకెళ్లారు.ఘటన స్థలానికి పోలీసులు చేరుకొని క్యూస్ టీంతో ఆధారాలు సేకరించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



## చిన్నేరు వాగు బ్రిడ్జ్ ను వెంటనే పూర్తి చేయాలి:సిపిఎం

యాదాద్రి భువనగిరి జిల్లా జూలై.14,భువనగిరి నియోజకవర్గ ప్రతినిధి:

జనసముద్రం న్యూస్ భువనగిరి మండలం నందనం సిరివేణికుంట మధ్య పెండింగ్లో ఉన్న చిన్నేరు వాగు నిర్మాణం వెంటనే పూర్తి చేయాలని భువనగిరి సిపిఎం మండల కార్యదర్శి దెయ్యాల నరసింహ డిమాండ్ చేశారు.ఆదివారం బ్రిడ్జి నిర్మాణ పనులను నరసింహ పరిశీలించి మాట్లాడారు.గత సంవత్సరం నుండి నిర్మాణం పెండింగ్లో ఉండడంతో రైతులకు ప్రజలకు రాకపోకలకు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు.వెంటనే బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తిచేసి ప్రజలకు సాగునీరు రాకపోకలకు ప్రయాణాన్ని సుగమం చేయాలన్నారు.



## యాదాద్రిలో పెరిగిన భక్తుల రద్దీ

యాదాద్రి భువనగిరి జిల్లా (జూలై.14)జనసముద్రం న్యూస్ యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి క్షేత్రానికి ఆదివారం భక్తులు పోటెత్తారు దీంతో ఆలయంలోని పరిసర ప్రాంతాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి.భక్తులు కొండ కింద కళ్యాణ కట్టలో తలనీలాలు సమర్పించి,కొండపైకి చేరుకొని దర్శించుకున్నారు. స్వామివారి దర్శనానికి మూడు గంటలకు పైగా సమయం పడుతుంది.ప్రత్యేక దర్శనానికి దాదాపు గంట సమయం పడుతుంది.

## నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు



దామరచర్ల మండలం.జులై 14.(జనసముద్రం న్యూస్):దామరచర్ల గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ కొండారపు చిన్న కృష్ణయ్య(వయస్సు 70 సంవత్సరాలు)గత కొంతకాలముగా అనారోగ్యంతో బాదపడుతూ తుది శ్వాస విడిచారు. స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బిఆర్ఎస్ పార్టీ మిర్యాలగూడ నియోజక వర్గ ఇంచార్జ్ నల్లమోతు భాస్కర్ రావు వారి స్వగృహానికి చేరుకొని పార్థివ దేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.వారి వెంట తాజా మాజీ జెడ్పీ కో-ఆప్షన్ మెంబర్ ఎండి. మోషీన్ అలీ,తాజా మాజీ జెడ్పీటీసీ అంగోతు లలిత హాతీరాం నాయక్,తాజా మాజీ ఎంపీటీసీ లు బాల సత్యనారాయణ,సోము సైదిరెడ్డి,వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కందుల నాగిరెడ్డి,బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి దారగాని వెంకటేశ్వర్లు,కొండారపు నాగేశ్వర రావు,కొండారపు వీర సైదులు,కందుల నారాయణ రెడ్డి,యూత్ నాయకులు రఫీ భాయ్,ఘనపురపు కృష్ణయ్య,హాజీ మరియు తదితరులు ఉన్నారు.




## వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి

జన్నారం మండల విలేఖరి, జనసముద్రం న్యూస్, జూలై 14జన్నారం మండలంలోని అన్ని గ్రామాలలో వైద్య సిబ్బంది ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు. మండలంలో విస్తారంగా వర్షాలు పడుతున్నాయి. దీంతో చాలా గ్రామాలలో ప్రజలు దగ్గు, జలుబు, జ్వరం, విరేచనాలతో బాధపడుతున్నారు. గ్రామాలలో సరైన వైద్య సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదని వారు వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వ్యాధులు ప్రబలకుండా చూడాలని వారు కోరారు.



## ఎల్కతుర్తి మండలంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ.

జనసముద్రం న్యూస్, హుస్నాబాద్ జులై14:ఎల్కతుర్తి మండలం సూరారం గ్రామంలోని లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందచేయడం జరిగింది.పులింటి సంగీత్ తండ్రి రాములు కు 19500,దూలం ప్రభాకర్ తండ్రి నర్సయ్య కు 23500,కుర్ర సరోజన భర్త సంపత్ కు 11500,గుండేటి కృష్ణ తండ్రి దేవరజం కు 21000,చెల్పూరి లింగమ్మ భర్త మొగిలి కి 9000,మరియు శీలం రాజుగారు తండ్రి కనుకయ్యకు 13500,సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేసారూ సూరారం కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బచ్చు శ్రీధర్ రావు,మొలుగూరి భాస్కర్,దూలం ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.



## గ్రామదేవతలకు మొక్కులు సమర్పించిన ప్రజలు

జన్నారం మండల విలేఖరి, జన సముద్రం న్యూస్, జూలై 14జన్నారం మండలంలోని మురిమడుగు గ్రామ ప్రజలు గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆషాడ మాసం పురస్కరించుకొని ఆదివారం ఆ గ్రామంలో ఊరు కట్టడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రజలు, భక్తులు డప్పు చప్పుల్ల మధ్య ఊరు శివారు వరకు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం గ్రామదేవతలకు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. వర్షాలు బాగా పడి పంటలు మంచిగా పండాలని, సీజనల్ వ్యాధులు రాకుండా ప్రజలు సుఖశాంతులతో జీవించాలని కోరుకుంటూ వారు పూజలు చేశారు. దీంతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం ఏర్పడింది.



## ఇంటింటా మొక్కలు నాటండి

### -జెడ్పీ ముఖ్య కార్యనిర్వహణాధికారిని శోభారాణి

యాదాద్రి భువనగిరి జిల్లా జూలై.14,భువనగిరి నియోజకవర్గ ప్రతినిధి:జనసముద్రం న్యూస్ భువనగిరి మండలం వడాయిగూడెంలో మహిళలకు జెడ్పీ ముఖ్య కార్యనిర్వహణాధికారిణి శోభారాణి మొక్కలు అందజేసి మాట్లాడారు.ప్రతి ఇంటి కాళీ స్థలంలో మొక్కలు నాటాలని ఆమె అన్నారు.అనంతరం నర్సరీని సందర్శించారు.ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి కె.ఆమని,క్షేత్ర సహాయకుడు బబ్బురి శంకర్ పాల్గొన్నారు.

## తన భూమిని సర్వే చేయించి న్యాయం చేయాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్ ను కోరిన భూక్యా శ్రీను నాయక్

మహాబూబబాద్ జిల్లా ప్రతినిధి జనసముద్రం న్యూస్ జులై 14 జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్ ను తన క్యాంపు కార్యాలయంలో కలిసి మహబూబాబాద్ మండలంలోని శనిగపురం రెవిన్యూ శివారులో గల సర్వే నెంబర్లు 273, 274, 275, 278, 279 మరియు వాటి నెంబర్లలో 1973- 74 సంవత్సరంలో 38/ఈ టెన్స్ యాక్ట్ ద్వారా తన తాతలకు సంక్రమించిన వారసత్వ భూమి 72 ఎకరాలలో 62.23 ఎకరాల భూమిని డాక్టర్ జన్నపురెడ్డి ప్రమోద్ రెడ్డి, జన్నపు రెడ్డి మంజుల, టి ఎఫ్ వై ప్రాజెక్టు అధినేత తాళ్లకోళ్ల పూర్ణచందర్ రెడ్డి, సింగం మనోహర్, కరుణావత్ వెంకన్న, కరుణావత్ రాధాబాయి, కుంచారపు వెంకటేశ్వర్లు, రామడుగు మధుసూదన్, చోడవరపు మోహన్ రావు లతోపాటు మరి కొంతమంది తనకు వారసత్వంగా సంక్రమించిన భూములను అక్రమంగా తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించుకుని, అధికారులను తప్పుదోవ పట్టించి, అక్రమ పర్మిషన్లు పొంది, అక్రమ నిర్మాణాలు నిర్మించుకుంటున్నారు. ఈ విషయంపై గత 12 సంవత్సరాల నుండి కలెక్టర్ కార్యాలయం, జిల్లా రెవెన్యూ కార్యాలయం చుట్టూ చెప్పులు అరిగేలా తిరిగినా కూడా ఫలితం లేదు. ఇకనైనా తమరు దీనిపై స్పందించి తన వారసత్వ భూములను జిల్లా సర్వే అధికారితో సర్వే చేపించి తనకు న్యాయం చేయగలరని కోరారు. దీనికి స్పందించి హుస్సేన్ నాయక్ వెంటనే జిల్లా సర్వే అధికారిని భూక్య శ్రీను కు సంబంధించిన భూములను వెంటనే



సర్వే చేయాలని ఆదేశాలు జారీ చేశారు ఈ కార్యక్రమంలో ఎల్ హెచ్ పి ఎస్ వ్యవస్థాపక సభ్యులు బోడ పృథ్వీరాజ్ నాయక్, ఎల్ హెచ్ పి ఎస్ జిల్లా అధ్యక్షుడు బోడ రమేష్ నాయక్, బిజెపి మాజీ ఎంపీపీ ఎల్ది మల్లయ్య, జిల్లా నాయకులు ముల్లంగి ప్రతాపరెడ్డి పాల్గొన్నారు.

## జమలాపురం - కేసముద్రం మండలం అన్నా ఆపద అంటే అండగా నిలుస్తున్న సమ్మి గౌడ్ ఫౌండేషన్

మహాబాద్ జిల్లా ప్రతినిధి జన సముద్రం న్యూస్ జూలై 14 మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం జమలాపురం గ్రామంలోపేదల కుటుంబాలకు పెద్దన్నగా చెలివేరు సమ్మన్నసునీత కుటుంబాన్ని పరామర్శించి 5000/-(50 కేజీల బియ్యం )ఆర్థిక సాయం అందజేసిన సమ్మయ్య గౌడ్ పదవులు లేకున్నా పేదల పట్ల ప్రేమ కలిగిన వ్యక్తి చిలువేరు సమ్మయ్య గౌడ్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఆయూబ్ ఖాన్కేసముద్రం మండలం కేసముద్రం పట్టణంలోని జమాలా పురం లో ఆదివారం పోరండ్ల సునీత ఇటీవల అనారోగ్యంతో మరణించగా వారి దశదినకర్మకు హాజరై వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అదేవిధంగా సమ్మి గౌడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సునీత భర్త వీరయ్యను, కుమార్తె రాజలక్ష్మి కుమారులు రాజు, రాజా వర్ధన్ లను లను పరామర్శించి సునీత ఆత్మకు శాంతి చేకూరాలని శ్రద్ధాంజలి ఘటించి వారి కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటానని భరోసా కల్పించి సమ్మి గౌడ్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు చిలువేరు సమ్మయ్య గౌడ్ 50 కేజీల బియ్యం,2,000 రూ పాయల ఆర్థిక సహాయం అందజేశారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు గ్రంథాలయ కమిటీ మాజీ చైర్మన్ అయూబ్ ఖాన్ మాట్లాడుతూ మన కేసముద్రం మండల కేంద్రంలోని ఏ కుటుంబాలైనా సరే ఆపదలో ఉన్నారని తెలియచేస్తే చాలు వెంటనే అక్కడికి చేరుకొని ఆ కుటుంబాలకు వారి సహాయ సహకారాలు అందజేయడం వారి గొప్ప మనసుకు నిదర్శనం అన్నారు. ఇలా ఏ పదవులు లేకపోయినా పేద కుటుంబాలకు, అనాధలకు ఆపదలో ఉన్న వారికి వృద్ధులకు ఆపద ఉందని వారి ఇంటి కడుపు తొక్కితే చాలు వెనక ముందు ఆలోచించకుండా సహాయం చేసే ఉన్నతమైన వ్యక్తి అని



ఎన్నో విధాలుగా సహాయ సహకారాలు అందిస్తున్నందుకు వారికి, వారి ఫౌండేషన్ కు అభినందనలు తెలియజేస్తున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు,గండి వీరేందర్, కొండేటి కళాధర్,మాజీ వార్డు సభ్యులు బానోత్ బాలు నాయక్, జల్లంపల్లి సుధాకర్, మిట్ట గడుపుల జలంధర్, జల్లంపల్లి శ్రీకాంత్,మచ్చ వెంకటేష్,ఈదుల బిక్షపతి, మోరపాక సామేల్,ఈదుల ప్రభాకర్,కమలమ్మ,ఆశా కార్యకర్త బరిగల మణి, ప్రియాంక,అమ్మి,సుశీల, శైలజ,క్రీస్తు మని, సోమమ్మ, బచ్చల వెంకటయ్య, వెంకటమ్మ,మచ్చ శోభ పాల్గొన్నారు...

# అక్రిడేషన్ నూతన కమిటీ వేళాయేరా

### సభ్యత్వాలు అంటూ రోడ్డెక్కిన జర్నలిస్ట్ యూనియన్ నాయకులు.

### ఏ యూనియన్ లో చేరాలి ఎవరు ఏం చేశారు అంటూ నిల దీస్తున్న వర్కింగ్ జర్నలిస్ట్ లు



మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి జన సముద్రం న్యూస్ జులై 14 మహబూబాబాద్ జిల్లాలో జర్నలిస్ట్ సంఘాలు తమ తమ సభ్యత్వాలను పెంచుకొనే పనిలో పడ్డాయి. ఇన్నాళ్లు వర్కింగ్ జర్నలిస్ట్ లు అక్రెడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని అర్హులైన అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేపట్టాలని మొర పెట్టుకున్నా పట్టించుకోని అక్రెడిటేషన్ కమిటీ సభ్యులు ఇప్పుడు తమ తమ పదవులు ఉంటాయో ఉండవో అని మళ్ళీ అక్రెడిటేషన్ కమిటీ సభ్యులుగా వుంటే మరలా తమ ఆదాయ మార్గాలు మళ్ళీ మెరుగుపరచుకోవచ్చునని మా యూనియన్ లో ఇంతమంది జర్నలిస్ట్ లు ఉన్నారని చూపించి రాష్ట్ర స్థాయి యూనియన్ సభ్యుల నుండి కూడా నిధులు తెచ్చుకోవచ్చని భావించి తమ పదవులు నిలబెట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు.గత రెండు సంవత్సరాలుగా జిల్లాలోని వర్కింగ్ జర్నలిస్ట్ ల సమస్యలు పట్టించుకోని అక్రెడిటేషన్ కమిటీ సభ్యులుగా ఉన్న యూనియన్ నాయకులు మరలా అక్రెడిటేషన్ నూతన కమిటీ సమయం గడువు దగ్గర పడుతుండడంతో మా యూనియన్ లో చేరాలి అని గ్రూప్ లలో ఊదరగొడుతున్నారు. మళ్ళీ అక్రెడిటేషన్ కమిటీ సభ్యులుగా వీరినే ఎంపిక చేస్తే ఇప్పటికే అనేక ఇబ్బందులు పడుతున్న నిజమైన వర్కింగ్ జర్నలిస్ట్ లు తమ గోడు ఎవరితో చెప్పుకోవాలో తెలియని పరిస్థితి ఏర్పడుతుంది. ఆదాయ మార్గాలు చూసుకుంటూ నకిలీ విలేకరులకు అక్రెడిటేషన్ కార్డుల మంజూరు చేసి ఆదాయ సముపార్జన కొరకు మాత్రమే పనిచేసే యూనియన్ నాయకులగా ఉంటూ ప్రజా సమస్యలపై పోరాడని యూనియన్ నాయకుల నుండి దూరంగా ఉండండి అంటూ నిజమైన వర్కింగ్ జర్నలిస్ట్ లు పిలుపునిస్తున్నారు. జివో నెం 239 ప్రకారం ప్రతి మూడు నెలలకు ఒకసారి అక్రెడిటేషన్ కమిటీ సమావేశం నిర్వహించాల్సి ఉన్న కమిటీ సభ్యులు నియమ నిబంధనలు పాటించకుండా అక్రెడిటేషన్ కు దరఖాస్తు చేసుకున్న వారి దరఖాస్తులను పరిశీలించి వారికి కార్డుల మంజూరు చేయకుండా అడ్డుపడ్డ అక్రెడిటేషన్ కమిటీ సభ్యులను బహిష్కరించి నకిలీ జర్నలిస్ట్ లను తులనాడలని తద్వారా మీడియా యొక్క ప్రాముఖ్యతను గొప్పదనాన్ని చాటాలని వర్కింగ్ జర్నలిస్ట్ లు కోరుతున్నారు.ఒక యూనియన్ నాయకుడిగా ఉంటూ జిల్లా జర్నలిస్టుల అధ్యక్షుడును అంటూ జిల్లాలోని ప్రముఖులను తన గ్రూపుల్లో జోకుతూ అందిన కాడికి వారి దగ్గర నుంచి వసూలు చేస్తూ జర్నలిజం ను తాకట్టు పెడుతున్నారు ఈ అక్రెడిటేషన్ సభ్యులుగా ఉన్న యూనియన్ నాయకులు.ఇంకా ఎంతకాలం ఇలా చెప్పుకుంటూ పోతారు. ఒక మేధావి మౌనం వల్ల అసమర్థుడి రాజ్యమేలుతాడు అన్న మాట ఎంత నిజమో..... ఎదిరించే వాడే లేకపోతే బెదిరించే వాడిదే రాజ్యం అవుతుందన్న రీతిన తయారైంది మహబూబాబాద్ లో జర్నలిస్టుల సమస్య.ఇంకా ఏదో గ్రూప్ సభ్యత్వం అంటూ ఒకరిని పట్టుకు వేలాడుదాం....ఇకనైనా మేల్కొనండి ఒకరి స్వార్థం కోసం మన జీవితాన్ని అంకితం చేద్దామా...? మనల్ని గుర్తించని యూనియన్ సభ్యత్వాలు మనకు అవసరమా...? ఒక ఊరు అబివృద్ధికి కోసం ఊరిలోని ఓటర్లంత ఓటింగ్ గు దురంగా ఉండి ప్రజా ప్రతినిధుల చేతా ఎలా పని చేయించుకుంటారో ....అక్రెడిటేషన్ కమిటీ సభ్యుల చేత మోసపోయిన వర్కింగ్ జర్నలిస్టులందరూ ఒక తాటిపైకి వచ్చి నిజమైన జర్నలిస్టుల కోసం పోరాడే యూనియన్ కి మద్దతిచ్చి అందులో చేరాలని నిర్ణయించుకున్నారు.తమని గుర్తించి తమ సమస్యల పై పోరాడే యూనియన్లకే తమ మద్దతు తెలుపుతామంటూ ఒక్కటవుతున్నారు ఇన్నాళ్ళు దగాపడ్డ అక్రెడిటేషన్ కార్డులకు అర్హులైన జర్నలిస్ట్ మిత్రులందరూ.

## అక్రమంగా పప్రెవెంటివ్ అరెస్టు పేరుతో బీజేవైఎం ఎబివిపి కార్యకర్తలు అరెస్ట్

యాదాద్రి భువనగిరి జిల్లా జూలై.14,భువనగిరి నియోజకవర్గ ప్రతినిధి:జనసముద్రం న్యూస్ భువనగిరి:-తెలంగాణ రాష్ట్రంలో కెసిఆర్ పాలనను అంతమొందించి నిరుద్యోగులకు విద్యార్థులకు న్యాయం చేస్తాడని రేవంత్ రెడ్డిని ఎన్నుకుంటే రేవంత్ రెడ్డి కూడా నిరుద్యోగులకు విద్యార్థులకు అన్యాయం చేస్తూ,ప్రివెంటివ్ అరెస్ట్ పేరుతో విచ్చలవిడిగా విద్యార్థులను అరెస్ట్ చేయడం జరుగుతుంది.ఆదివారం రోజు యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో బీజేవైఎం ఏబీవీపీ కార్యకర్తలను నిన్న రాత్రి అశోక్ నగర్ లో డీఎస్సీ నిరుద్యోగుల చేసిన నిరసన కు (ఉద్యమానికి )ఎటువంటి సంబంధం లేకున్నప్పటికీ,అదేవిధంగా అబ్దుల్లాపూర్మెట్ లో సీఎం రేవంత్ రెడ్డి పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఎక్కడ అడ్డుకుంటామో అనే అపోహలోతు ఆదివారం తెల్లవారజామున 5 గంటలకు బీజేవైఎం యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు పట్నం కపిల్,ఏబీవీపీ ఉమ్మడి నల్గొండ జిల్లా కన్వీనర్ సుర్వి మణికంఠ,బీజేవైఎం పట్టణ ప్రధాన కార్యదర్శి కొలిచలిమ మల్లికార్జున్,రత్నపురం ప్రవీణ్,నల్లవెల్లి శివ,దిడ్డికాడ్డి మహేష్,తాడూరి రాకేష్ లను,ప్రెవెంటివ్ అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ నిర్బంధించడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అయ్యా రేవంత్ రెడ్డి మాకు అరెస్టులు కొత్త కాదు కేసులు కొత్త కాదు మీకు ఒకటే హెచ్చరిస్తున్నాం అక్రమ అరెస్టులు ఉద్యమాన్ని ఆపలేవు, మమల్ని నువ్వెంత అణచివేస్తే,అంతంత పైకి లేచి ఉద్యమించి నీకు కెసిఆర్ కు పట్టిన గతే తీసుకువస్తామని తెలియజేస్తున్నాం.ఆదివారం రోజు బోనాల పండగ ఉండగా జిల్లా వ్యాప్తంగా



విద్యార్థి యువజన నాయకులను అరెస్ట్ చేయడం ఎంతవరకు సబబో మీరే అర్థం చేసుకోవాలి సీఎం గారు,తెలంగాణలో హిందువులు చేసుకునే అతిపెద్ద పండుగ బోనాల పండుగను పండుగలు విద్యార్థులు నాయకుడు పాల్గొనకుండా ఈ విధంగా అరెస్టు చేయడం తీవ్రంగా ఖండిస్తున్నామని వారన్నారు.

## గృహజ్యోతి పథక దరఖాస్తుదారులకు సవరణలకు అవకాశం



జనసముద్రం న్యూస్ ప్రతినిధి మధిర జూలై 14,

ప్రజా పాలనలో గృహజ్యోతి పథకం కింద దరఖాస్తు చేసుకున్న 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించే వినియోగదారులు కొన్ని ఆన్లైన్ పొరపాట్ల వలన ఇప్పటివరకు గృహ జ్యోతి పథకం ద్వారా లబ్ది పొందనట్లయితే మధిర మున్సిపాలిటీ మరియు మధిర, ఎర్రుపాలెం మండల ఆఫీసుల నందు ఏర్పాటు కాబడిన ప్రజా పాలన కేంద్రాల ద్వారా మీ యొక్క సర్వీస్ నెంబర్ సరి చేయించు కొనవచ్చును. అదేవిధంగా మీ సర్వీస్ నెంబర్ కు రేషన్ కార్డుని అనుసంధానించు కొనుట మరియు అద్దె ఇంట్లో ఉండే విద్యుత్ వినియో గదారులు మరియొక ఇంటికి మారి నప్పుడు ఆ ఇంటి సర్వీసు నెంబర్ కనెక్షన్ తో అనుసంధానం చేసుకొని, గృహ జ్యోతి పథకం కింద జీరో బిల్లు పొందవలసినదిగా మధిర విద్యుత్ శాఖ సబ్ డివిజన్ ఏడిఈ ఎం. అనురాధ గారు తెలియజేస్తున్నారు.

## హైమా గార్డెన్ మొదటి వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే డా,మురళి నాయక్



మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి జన సముద్రం న్యూస్ జులై 14 మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని అనంతరం పక్కన ఉన్నటువంటి హైమ గార్డెన్ యొక్క మొదటి వార్షికోత్సవ సందర్భంగా కమిటీ యొక్క పిలుపు మేరకు ఆ యొక్క కార్యక్రమంలో పాల్గొన్నా మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్యా మురళి నాయక్ ఈ కార్యక్రమం అనంతరం ఎమ్మెల్యే గారికి ఆ యొక్క కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించారుఈ కార్యక్రమంలో మహబూబాబాద్ మండల అధ్యక్షులు మిట్టకండి రాంరెడ్డి , టౌన్ అధ్యక్షులు ఘనపురం అంజయ్య అనంతరం వార్డు కౌన్సిలర్ కోడి శ్రీను కాంగ్రెస్ పార్టీ నాయకులు శాంతన్ రాజు మైనార్టీ నాయకులు వివిధ పార్టీల నాయకులు కమిటీ సభ్యులు పాల్గొన్నారు



# 1000 కోట్ల క్లబ్‌లో కల్కి

ప్రభాస్ 'కల్కి 2898ఏడీ' సినిమా వెయ్యికోట్ల మైలురాయిని చేరుకుంది. టాలీవుడ్‌లో రూపొందిన పానిండియా సినిమాల్లో వెయ్యికోట్ల మైల్‌స్టోన్‌ని చేరుకున్న మూడో సినిమాగా 'కల్కి 2898ఏడీ' నిలిచింది. 'బాహుబలి 2' 18వందలకోట్ల పై చిలుకు వసూళ్లను సాధించి టాలీవుడ్ నంబర్‌వన్ మూవీగా నిలువగా, రాజమౌళి 'ఆర్‌ఆర్‌ఆర్' దాదాపు 12వందలకోట్ల వసూళ్లతో రెండో స్థానంలో నిలిచింది. ఇప్పుడు ప్రభాస్ 'కల్కి 2898ఏడీ' మూడోవారానికే వెయ్యికోట్ల మైలురాయి చేరుకోవడమే కాక, ఇంకా విజయవంతంగా ప్రదర్శింపబడుతున్నదని మేకర్స్ ఆనందం వెలిబుచ్చారు. ప్రభాస్ కెరీర్‌లో వెయ్యికోట్ల మైలురాయి చేరుకున్న రెండో సినిమా 'కల్కి 2898ఏడీ'. ఇప్పటికే పలు ప్రాంతాలో ఈ సినిమా నాన్ బాహుబలి రికార్డులన్నింటినీ తిరగరాసిందని మేకర్స్ చెబుతున్నారు.



# యాక్షన్ ఘట్టాల్లో మట్కా

వరుణ్‌తేజ్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'మట్కా'. కరుణకుమార్ దర్శకుడు. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన యథార్థ ఘటనల ఆధారంగా పీరియాడిక్ మూవీగా తెరకెక్కిస్తున్నారు. మీనాక్షి చౌదరి కథానాయిక. ప్రస్తుతం హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుగుతున్నది. విజయ్ మాస్టర్ నేతృత్వంలో భారీ యాక్షన్ సీక్వెన్స్‌ను తెరకెక్కిస్తున్నారు. ఈ పోరాట ఘట్టాల్లో హీరో వరుణ్‌తేజ్ రిస్కీ స్టంట్స్ పర్‌ఫార్మ్ చేస్తున్నాడని, ఈ ఫైట్ సీక్వెన్స్ సినిమాలో హైలైట్‌గా నిలుస్తుందని చిత్ర బృందం పేర్కొంది. మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా భారీ వ్యయంతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నామని, యథార్థ ఘటనల ఆధారంగా రూపొందుతున్న ఈ చిత్రం ప్రతి ఒక్కరికి నచ్చుతుందని దర్శకుడు తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాష్ కుమార్, నిర్మాతలు: డాక్టర్ విజయేందర్ రెడ్డి, రజనీ తాళ్లూరి, కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం: కరుణ కుమార్.

# అరె ఏమయ్యింది ఉన్నట్టుండివ్వాళే..



నాని కథానాయకుడిగా రూపొందుతోన్న చిత్రం 'సరిపోదా శనివారం'. ప్రియాంక అరుళ్ మోహన్ కథానాయిక. వివేక్ ఆత్రేయ దర్శకుడు. డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి నిర్మాతలు. వచ్చే నెల 29న సినిమా విడుదల కానుంది. ప్రమోషన్‌లో భాగంగా శనివారం ఈ సినిమాలోని సెకండ్ సింగిల్ 'ఉల్లాసం..' సాంగ్‌ని మేకర్స్ విడుదల చేశారు. 'అరె ఏమయ్యింది ఉన్నట్టుండివ్వాళే.. అలవాటేలేని ఏవో ఆనందాలే..' అంటూ సనరే రాసిన ఈ పాటను జేక్స్ బిజోయ్ స్వరపరచగా, సంజిత్ హెగ్డే, కృష్ణలాస్య ఆలపించారు. తొలి ప్రేమ అనుభవాలను తెలియజేస్తూ రొమాంటిక్‌గా ఈ పాట సాగింది. ఇందులో నాని, ప్రియాంక మోహన్‌ల నేచురల్ ఎక్స్‌ప్రెషన్స్ చూడొచ్చు. యువతరాన్ని ఆకట్టుకునేలా ఈ పాట విజువల్స్ ఉన్నాయి. ఎస్.జె.సూర్య కీలక పాత్ర చేస్తున్న ఈ చిత్రంలో సాయికుమార్ ప్రత్యేక పాత్ర పోషిస్తున్నారు. ఈ చిత్రానికి కెమెరా: మురళి జి., నిర్మాణం: డి.వి.వి.ఎంటర్‌టైన్‌మెంట్స్.



# అందుకే ఇంత టైమ్ తీసుకున్నా

'ఇందులో నాది చాలెంజింగ్ రోల్. ఇప్పటివరకూ ఇలాంటి పాత్ర చేయలేదు. స్లిట్ పర్సనాలిటీ డిజార్డర్ ఉన్న అమ్మాయిగా ఇందులో కనిపిస్తా. దర్శకుడు అశ్విన్‌రామ్ కథ చెప్పినప్పుడు ఎక్సయిటింగ్ అనిపించింది. ఇలాంటి విభిన్నమైన పాత్ర దొరకడం నా అదృష్టం.' అంటూ అందాలభామ నభానటేష్ ఆనందం వెలిబుచ్చింది. ప్రియదర్శికి జోడీగా ఆమె నటించిన రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ 'డార్లింగ్'. అశ్విన్‌రామ్ దర్శకుడు. కె.నిరంజన్‌రెడ్డి, శ్రీమతి చైతన్య నిర్మాతలు. ఈ నెల 19న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా నభా శనివారం విలేకరులతో ముచ్చటించింది. 'యాక్సిడెంట్ వల్ల భుజానికి గాయమై రెండేళ్లుగా సినిమాలు చేయలేకపోయా. ఆడియన్స్‌కి నా ఎనర్జీ ఇష్టం. మళ్లీ మునుపటి ఎనర్జీతోనే రావాలని ఇంత టైమ్ తీసుకున్నా. సరైన సినిమాతో కమ్‌బ్యాక్ అవుతున్నందుకు ఆనందంగా ఉంది. 'డార్లింగ్'లో ఫన్‌తో పాటు ప్రేమ, కుటుంబ ఉద్వేగాలు, థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ ఇలా అన్నీ ఉంటాయి.' అని తెలిపింది నభా నటేశ్. 'ఇందులో రెండు డిఫరెంట్ రోల్స్ చేయాలి. అందుకోసం చాలా హోంవర్క్ చేశా. స్లిట్ పర్సనాలిటీ సినిమాలు చాలా చూశా. ఆ కష్టం రేపు స్క్రీన్‌పై చూస్తారు. ప్రియదర్శితో కలిసి నటించడం చాలా బావుంది. మా కెమిస్ట్రీ అద్భుతంగా పడింది. నా యాక్షన్‌కి ప్రియదర్శి రియాక్షన్ సూపర్. తన కామెడీ టైమింగ్ నాచురల్‌గా ఉంటుంది. అలాగే, దర్శకుడు ఈ కథను మలిచిన తీరు, నిర్మాతల రాజీలేని తనం. వివేక్‌సాగర్ మ్యూజిక్.. ఇవన్నీ ఈ సినిమాకు ఎస్సెట్స్.' అని నభానటేశ్ పేర్కొన్నది.



# విశ్వంభర స్వరాలవేట

ఒకప్పుడు సినిమా మ్యూజిక్ సిట్టింగ్స్ అంటే ఓం పండుగలా జరిగేది. సంగీత దర్శకుడు, గీత రచయిత, దర్శకుడు, నిర్మాత, గాయనీగాయకులు, హీరో.. ఇలా అందరూ కూర్చొని ఒకరి అభిప్రాయాలను ఒకరు పంచుకుంటూ మంచి ఆల్బమ్ వచ్చే వరకూ కసరత్తులు చేసేవారు. ఇప్పుడైతే ఆ పరిస్థితి లేదు. సంగీతం, సాహిత్యం అన్నీ ఫోన్లలోనే వినడం, ఫోన్లోనే ఓకే చేయడం. అయితే.. 'విశ్వంభర' టీమ్ ఈ పద్ధతికి ఫుల్‌స్టాప్ పెట్టి, పాత విధానానికి శ్రీకారం చుట్టింది. బెంగళూరులోని కీరవాణి ఫామ్‌హౌస్‌లో చిరంజీవి, కీరవాణి, దర్శకుడు వశిష్ఠ, గీత రచయిత చంద్రబోస్, గాయకుడు రాహుల్ సిప్లిగంజ్ అంతా కలిసి మ్యూజిక్ సిట్టింగ్స్‌లో కూర్చుని అద్భుతమైన ఆల్బమ్‌ని రాబట్టేందుకు కృషి చేస్తున్నారు. షూటింగ్‌కి బ్రేక్ రావడంతో ఈ సమయాన్ని మ్యూజిక్ సిట్టింగ్స్ కోసం వాడుకుంటున్నారు మూవీ టీమ్. వారంరోజుల పాటు వీరంతా అక్కడే ఉండి 'విశ్వంభర' పాటల పనిపట్టి తిరిగొస్తారట. చిరంజీవి నటించిన ఘరానామొగుడు, ఆపద్బాంధవుడు, ఎస్పీ పరశురామ్ చిత్రాలకు కీరవాణి స్వరాలందించారు. మ్యూజికల్‌గా మూడు సినిమాలూ ఆకట్టుకున్నాయి. 'విశ్వంభర' నాలుగో సినిమా. ఎలాగైనా మంచి పాటలు ఇవ్వడానికి కీరవాణి మనసుపెట్టి పనిచేస్తున్నారు. త్రిష కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రం జనవరి 10న సంక్రాంతి కానుకగా విడుదల కానుంది.



# ఫ్యామిలీ సెంటిమెంట్ హైలైట్‌గా

రాజ్‌తరుణ్ హీరోగా నటిస్తున్న చిత్రం 'తిరగబడరసామీ'. ఏ.ఎస్.రవికుమార్ చౌదరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి మల్కాపురం శివకుమార్ నిర్మాత. మాల్వీ మల్హోత్రా కథానాయిక. మాస్, యాక్షన్ అంశాలతో ఎమోషనల్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కించారు. ఈ చిత్రాన్ని ఆగస్ట్ 2న విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ ప్రకటించారు. దర్శకుడు ఏ.ఎస్.రవికుమార్ చౌదరి తనదైన శైలి మాస్ అంశాలతో రాజ్‌తరుణ్‌ను కొత్త పంథాలో ప్రజెంట్ చేశాడని, ఫ్యామిలీ సెంటిమెంట్ కలబోసిన యాక్షన్ ఎంటర్‌టైనర్ ఇదని చిత్ర బృందం పేర్కొంది. మన్నారా చోప్రా ఈ సినిమాలో ప్రత్యేక గీతాన్ని చేస్తున్నది. మకరంద్ దేశ్‌పాండే, రఘుబాబు, జాన్ విజయ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: జేబీ, భోలేషావలి, రచన-దర్శకత్వం: ఏఎస్ రవికుమార్ చౌదరి.

# స్పిరిట్ కోసం హాలీవుడ్ విలన్?

ప్రభాస్ 'కల్కి 2898ఏడీ' స్పీడ్ మామూలుగా లేదు. ఇప్పటికే వెయ్యికోట్ల మార్క్‌కు చేరవగా వచ్చేసింది. మరి ఈ వేగానికి బ్రేక్ ఎక్కడ పడుతుందో ఇప్పుడైతే ఎవరికీ క్లారిటీ లేదు. ఈ ప్రయాణంలో ఎన్ని రికార్డులు బద్దలవుతాయో కూడా చెప్పలేం. ఇప్పటికే పాన్ ఇండియా సూపర్‌స్టార్‌గా ఎదిగిన ప్రభాస్, 'కల్కి 2898ఏడీ' దెబ్బకి పాన్‌వరల్డ్ సూపర్‌స్టార్‌గా మారారని పలువురు అభిప్రాయపడుతున్నారు. అందుకేనేమో దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా తన 'స్పిరిట్' సినిమాను పాన్ వరల్డ్ స్థాయిలో తెరకెక్కించేందుకు సన్నాహాలు మొదలుపెట్టారు. ఈ సినిమా బడ్జెట్ మూడొందల కోట్ల పైనే అని తెలుస్తున్నది. టి.సిరీస్, భద్రకాళి ప్రొడక్షన్స్ కలిసి నిర్మించనున్న ఈ పాన్ వరల్డ్ సినిమాలో విలన్‌గా హాలీవుడ్ స్టార్ విలన్ లీ డాంగ్ సిక్‌ని తీసుకునేదుకు నిర్ణయించారట. అప్పుడే ఆయనతో సంప్రదింపులు కూడా మొదలయ్యాయని సమాచారం. ట్రైన్ టూ బూసాన్, మార్వెల్ సిరీస్ ఎటర్నల్ సినిమాల ద్వారా ఈ సౌత్ కొరియన్ యాక్టర్ ప్రపంచవ్యాప్త గుర్తింపు తెచ్చుకున్నారు. ఈ సినిమా కథ ఇంటర్నేషనల్ స్థాయిలో ఉంటుందట. అందుకే హాలీవుడ్ నటులపై దృష్టిసారించారు సందీప్‌రెడ్డి వంగా. ఇందులో ప్రభాస్ రెండు భిన్న కోణాల్లో కనిపిస్తారట. అందులో ఒకటి రఫ్ అండ్ రగ్గడ్‌గా ఉంటే.. రెండోది ట్కస్టైలిష్‌గా ఉంటుందట.





ఇందులో ప్రభాస్ పవర్‌ఫుల్ పోలీస్‌ఆఫీసర్‌గా కనిపిస్తారని గతంలో సందీప్‌రెడ్డి చెప్పారు. మరి ఈ రెండు గెటప్పుల్లో పోలీస్ గెటప్ దేనిదో తెలియాల్సివుంది. ఇందులో ప్రభాస్‌ది డ్యూయెల్ రోలా? లేక ఒకే పాత్రలో రెండు పార్శ్యాలుంటాయా? అనే విషయంలో కూడా క్లారిటీ రావాల్సివుంది. ప్రస్తుతం స్క్రిప్ట్ వర్క్ జరుపుకుంటున్న ఈ సినిమా ఈ ఏడాది చివర్లో సెట్స్‌కి వెళ్లే అవకాశం ఉంది.

# రాధిక 3.0గా ప్రియాంక?



టాలీవుడ్‌లో తెలుగమ్మాయిలు సక్సెస్ సాధించడం చాలా అరుదు. కానీ ప్రియాంక జవాల్కర్ తొలి సినిమా 'టాక్సీవాలా'తోనే హిట్ కొట్టేసి, లక్కీ హీరోయిన్ అనిపించుకుంది. చూడ్డానికి నార్త్ అమ్మాయిలా ఉండటం కూడా ప్రియాంకకు కలిసొచ్చిందని చెప్పాలి. రెండో సినిమా 'ఎస్ఆర్ కళ్యాణమండపం'తో ద్వితీయ విఘ్నాన్ని కూడా దాటేసింది. హిట్టయిన రెండూ చిన్న సినిమాలే కావడంతో ప్రియాంకకు అవకాశాలు పెద్దగా రాలేదు. అయితే.. అందుతున్న సమాచారం ప్రకారం ఈ అందాలభామ బంపర్‌ఆఫర్ కొట్టేసిందని తెలుస్తున్నది. 'టిల్లు స్కేర్'లో క్షణకాలం మెరిసిన ప్రియాంక, 'టిల్లు క్యూబ్'లో రాధిక 3.0గా కనిపించనుందని ఇన్‌సైడ్ టాక్. 'డీజే టిల్లు'లో రాధికగా నేహాశెట్టి నటించింది. ప్రస్తుతం అందరూ ఆమె పేరును మర్చిపోయి, రాధిక అనే పిలుస్తున్నారు. 'టిల్లు స్కేర్'లో కథానాయిక లిల్లీగా అనుపమాపరమేశ్వరన్ నటించినా, ఆమెను అందరూ రాధిక 2.0 అనే పిలుస్తున్నారు. ఇప్పుడు 'టిల్లూ క్యూబ్'లో ప్రియాంక జవాల్కర్ నటించనున్నట్టు వార్తలు బలంగానే వినిపిస్తున్నాయి. ఇదే నిజమైతే ఈ ముద్దుగుమ్మ కూడా రాధిక 3.0గా మారిపోవడం ఖాయం. ప్రస్తుతం సిద్ధు జొన్నలగడ్డ వేరే సినిమా పనిలో బిజీగా ఉన్నారు. ఆ సినిమా తర్వాత 'టిల్లూ క్యూబ్' ఉంటుందని తెలుస్తున్నది.



# ఇది పొగరుతో చెబుతున్న మాట కాదు

'ఆస్కార్ అవార్డును ప్రత్యేకంగా పరిగణించను. భారతీయ నటుడిగా ప్రపంచంలోనే అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వాలన్నదే నా కల. ఇది పొగరుతో చెబుతున్న మాట కాదు. నాపై నాకున్న నమ్మకంతో చెబుతున్నమాట.' అని కమల్‌హాసన్ అన్నారు. ఆస్కార్ అవార్డు గురించి విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా కమల్ పై విధంగా స్పందించారు. ఆయన కథానాయకుడిగా రూపొందిన చిత్రం 'భారతీయుడు 2'. 1996లో వచ్చిన 'భారతీయుడు' సినిమాకు సీక్వెల్‌గా శంకర్ తెరకెక్కించిన ఈ సినిమా ఈ నెల 12న విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కమల్ మాట్లాడారు. 'సినిమాకు కథే ముఖ్యం. కథ డిమాండ్ మేరకే పాత్రలుండాలి. ఈ సినిమాలో కమల్‌సార్ పాత్ర నిడివి తక్కువ అని చాలామంది అనుకుంటున్నారు. అందులో నిజంలేదు. ఇందులో ఆయన లేని సన్నివేశంలో కూడా ఆయన గురించే చర్చ నడుస్తుంటుంది. పార్ట్ 1లో అవినీతిపై పోరాటం చూపించాను. ఈ పార్ట్‌లో పోరాటం వైవిధ్యంగా ఉంటుంది.' అని శంకర్ అన్నారు. కథ డిమాండ్ మేరకే మూడో పార్ట్ కూడా తెస్తున్నామని, డబ్బుకోసంకాదని, 'భారతీయుడు2' యూనివర్సల్ సబ్జెక్ట్ కాబట్టే ఇన్ని పార్టులు తీయాల్సి వచ్చిందని శంకర్ తెలిపారు. 'భారతీయుడు 2'లో భాగం కావడంపట్ల హీరో సిద్ధార్థ్, రకుల్ ప్రీత్‌సింగ్ ఆనందం వెలిబుచ్చారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఈ సినిమాకు పంపిణీదారుడైన ప్రముఖ నిర్మాత డి.సురేశ్‌బాబు, బాబీ సింహా కూడా పాల్గొన్నారు.